ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 41.0 కనిష్ఠం : 27.0
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 1 మే 2025

ధర్మరక్షణకు కృషి చేయాలి

గణపతి సచ్చిదానంద స్వామి
దత్త మందిరంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ


విగ్రహ పునఃప్రతిష్ఠ చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ధర్మ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామి ఉద్బోధించారు. జిల్లా కేంద్రంలోని దత్తమందిరంలో అనఘాసమేత జ్ఞానసాగర దత్తాత్రేయ, కార్యసిద్ధి ఆంజనేయ, గణపతి, దత్త నాగలింగేశ్వర, నవగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు గణపతి సచ్చిదానందస్వామి, దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థ స్వామి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఆలయ ఆవరణలో దీక్షాహోమం, శాంతిపౌష్టిక హోమం, ప్రతిష్ఠాహోమం నిర్వహించి, పూర్ణాహుతి గావించారు. అనంతరం గణపతి సచ్చిదానంద స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ గావించి, బ్రహ్మకలశాభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో గణపతి సచ్చిదానందస్వామి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. దేవుడిపట్ల విశ్వాసం ఉండాలని, అప్పుడే మనలో ఆధ్యాత్మికత భావన, తద్వారా


పాల్గొన్న భక్తులు

మనోవికాసం కలుగుతాయని అన్నారు. దానం విషయంలో రాయలసీమవాసుల మనసు రాయిలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం దత్తమందిరం ఆవరణలో సభా మండపం, అర్చకుడి నివాస నిర్మాణానికి ఎవరూ సహకరించకపోవడం బాధాకరమని అన్నారు. తనకు వచ్చిన దక్షిణలను సభా మండప నిర్మాణానికి ఇచ్చానని తెలిపారు. మరికొన్ని పనులున్నాయని, రాయిలాంటి మనసు కరిగించుకుని, ఆలయ అభివృద్ధి పనులకు ముందుకు రావాలని భక్తులను కోరారు. భక్తులకు మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు.

ప్రజలు స్వేచ్ఛగా జీవించాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్..
- 85-నిట్టూరులో పౌరహక్కుల దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

యల్లనూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం యల్లనూరు మండలంలోని 85నిట్టూరు గ్రామంలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవానికి కలెక్టర్‌తోపాటు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్‌రహర్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతినెలా జిల్లాలో ఏదో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని పౌరహక్కుల దినోత్సవం చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో తనతోపాటు ఆయాశాఖల అధికారులు, పోలీసులు పాల్గొంటారని తెలిపారు. మండలాల వారిగా కేసుల వివరాలు సేకరించి, ఏ మండలంలో ఎక్కువ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయో అక్కడికి తాను, ఎస్పీ వెళతామని పేర్కొన్నారు. గ్రామంలో వివిధ కులాల నమ్మకాలను గౌరవిస్తూ శ్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని ఆర్డీఓను ఆదేశించారు. గ్రామంలోని ఎస్సీకాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మించాలని కాలనీవాసులు కోరారు. అనంతరం గ్రామంలోని చెన్నకేశవస్వామిని దర్శించి ఆలయ విశిష్టత గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ సత్యయేసుబాబు, తహసీల్దార్ శేషారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విత్తనం జాప్యం..?

మూడు రోజుల క్రితం టెండర్ల నిర్వహణ
ఖరారు కాని వేరుశనగ విత్తన సరఫరా ధర
విత్తన కేటాయింపులో భారీగా కోత
ఆందోళన చెందుతున్న రైతాంగం



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సాగుకు సబ్సిడీ వేరుశనగ పంపిణీ జాప్యమయ్యే ప్రమాదం కనిపిస్తోంది. విత్తన సరఫరా కోసం రాష్ట్ర స్థాయిలో మూడు రోజుల క్రితం టెండర్లు నిర్వహించారు. అయితే ఇప్పటికీ సరఫరా ధరను ఖరారు చేయలేదు. విత్తన సరఫరా ధర ఖరారు చేస్తేనే సేకరణ, ప్రాసెసింగ్ ప్రక్రియ మొదలవుతుంది. గత ఏడాది ఏప్రిల్ చివరి వారంలోనే ధరలు ఖరారు చేశారు. మే మొదటి నుంచి ప్రాసెసింగ్ ప్రారంభించారు. మే 17వతేదీన సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. ఆ మరుసటి రోజు నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలుపెట్టారు. మే మూడో వారం నుంచి విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభించారు. ఈ ఏడాది పరిస్థితి ఏమిటో తెలియడం లేదు. ప్రాసెసింగ్ ఆలస్యమైతే విత్తన నాణ్యతపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంట వేరుశనగ. విత్తన కాయలను సకాలంలో అందజేస్తే రైతులు సాగుకు సిద్ధమౌతారు. ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి మొదలౌతుంది. ముందస్తు వర్షాలు కురిస్తే మొదట్లోనే విత్తనం వేస్తారు.

రూ.90 కోట్లు రావాలి..

2024-25 ఖరీఫ్‌లో వేరుశనగ, ప్రత్యామ్నాయ విత్తనాలు, రబీలో పప్పుశనగ పంపిణీకి సంబంధించి ఏపీసీడ్స్‌కు రూ.90 కోట్ల నిధులు రావాల్సి ఉంది. ప్రతి ఏడాదీ ఆర్థిక సంవత్సరం ముగింపులోపే విత్తన పంపిణీ సొమ్మును ప్రభుత్వం జమ చేసేది. కానీ ఈ ఏడాది ఇప్పటికీ జమచేయలేదు. ఏం చేయాలో తెలియక ఏపీసీడ్స్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

భారీగా కోత

ఈ ఖరీఫ్‌కు జిల్లాకు 1,51,978 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించాలని వ్యవసాయ శాఖ యంత్రాంగం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. కానీ 54,184 క్వింటాళ్లతో ప్రభుత్వం సరిపెట్టింది. వేరుశనగ 1.45 లక్షల హెక్టార్లల్లో సాగు అయ్యే అవకాశం ఉందని, 1,33,763 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కేటాయించాలని కోరింది. కానీ 50,592 క్వింటాళ్ల వేరుశనగను మాత్రమే కేటాయించారు. 2023 ఖరీఫ్‌లో 78,245 క్వింటాళ్లు, గతేడాది 76,710 క్వింటాళ్ల వేరుశనగ కేటాయించారు. ఈ సారి మరీ తక్కువగా ఇచ్చారు. ఇతర రకాల విత్తనాలను కూడా తగ్గించారు. కందులు 5,347 క్వింటాళ్లు అడిగితే 2,380 క్వింటాళ్లు, వరి 8,054 క్వింటాళ్లకుగాను 800, కొర్ర 60కి 45, మినుములు 54కు 36, పచ్చిరొట్ట విత్తనాలు 750కు 207, పెసలు 95కు 60, అలసంద 85కు 60, రాగులు 10కి 4 క్వింటాళ్లు మాత్రమే కేటాయించారు. మొక్కజొన్న 2,300, జొన్న 373, ఆముదం 875, పొద్దుతిరుగుడు 85, ఉలవ 125 క్వింటాళ్లు కావాలని ప్రతిపాదనలు పంపాగా, ఒక్క కేజీ కూడా కేటాయించలేదు.

టెండర్లు నిర్వహించారు..



రాష్ట్రస్థాయిలో మూడు రోజుల క్రితం విత్తన వేరుశనగ సరఫరా కోసం టెండర్లు నిర్వహించారు. ఇంకా సరఫరా ధరలు ఖరారు చేయాల్సి ఉంది. విత్తన సరఫరా బాధ్యతలను ఏపీసీడ్స్‌కు అప్పగించారు. ధరలు రాగానే ప్రాసెసింగ్ ప్రక్రియ మొదలవుతుంది. జిల్లాలోని ప్రాసెసింగ్ యూనిట్లల్లో పకడ్బందీగా విత్తన ప్రాసెసింగ్ జరిగేలా చర్యలు తీసుకుంటాం. నాణ్యమైన విత్తన కాయలను పంపిణీ చేస్తాం.

- ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

3 నుంచి గ్రూప్-1 పరీక్షలు

నేటి నుంచి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ : కలెక్టర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు ఈనెల 3వ తేదీ నుంచి 9వరకు కొనసాగుతాయని కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలకు నగరంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజ్, శ్రీబాలాజీ పీజీ కాలేజ్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలు ముగిసే వరకు జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ కోఆర్డినేషన్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థుల సమస్యలు, అనుమానాలను తీర్చడం కోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కంట్రోల్ రూమ్ గురువారం నుంచి 9వతేదీ వరకు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని వివరించారు. అభ్యర్థులు తమ సమస్యలను 8500292992, 08554-220009 నెంబర్లకు ఫోన్‌చేసి తెలియజేయవచ్చని కలెక్టర్ వెల్లడించారు.

పంట దిగుబడిని కొనుగోలు చేయండి

ముఖ్యమంత్రికి ప్రభుత్వ విప్ కాలవ విజ్ఞప్తి


సీఎం చంద్రబాబును కలిసిన ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో ఈ-క్రాప్ కింద నమోదు కాని పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించటానికి అనుమతులు ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయనను కలిసి వినతి పత్రం సమర్పించారు. గత ఖరీఫ్‌సీజన్‌లో సాగుచేసిన పొలాల్లో ఈ-క్రాప్ బుకింగ్ చేయడంతో రబీలో సాగైన పంటకు నమోదు కాలేదని వివరించారు. కణేకల్లు మండల పరిధిలోని చిక్కణ్ణేశ్వరస్వామి వడియార్ చెరువు కింద రబీసీజన్‌లో సుమారు 524 మంది రైతులు 1486 ఎకరాల్లో వరి సాగు చేసినట్లు తెలిపారు. సాగైన పొలాలకు ఈ-క్రాప్ కానందున ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంట ఉత్పత్తుల కొనుగోలు చేయటం లేదని తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ వరి రూ. 1850 పలుకుతుండగా.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో కనీస మద్దతు ధర రూ. 2200కు సేకరిస్తున్నారని వివరించారు. రైతులు క్వింటాలుపై రూ. 350 నష్టపోవాల్సి వస్తోందని తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరించేలా అనుమతులు ఇప్పించాలని విన్నవించారు.

ఒకరు.. ఇద్దరే...!

పంచాయతీ సమావేశాలకు సభ్యుల డుమ్మా

(వివరాలు 7వ పేజీలో...)

కదలరు... వదలరు ..!

ఏళ్లుగా ఒకే చోట ఉద్యోగం
సీటు వదలని ఫెవికాల్ వీరులు
అవినీతి, అక్రమాలకు ఆజ్యం
అవినీతిపరుల రక్షణకు అధికారులు
ఏడీసీసీ బ్యాంకులో అక్రమాలు


ఏడీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నియంతల నడుమ జిల్లా సహకార కేంద్రబ్యాంకు(ఏడీసీసీబీ) నలిగిపోతోంది. ఇక్కడ ఏళ్లుగా పాతుకుపోయిన ఫెవికాల్ వీరులు అవినీతి, అక్రమాలకు ఆజ్యం పోస్తూ బ్యాంకు లక్ష్యాలను నీరుగారుస్తున్నారు. ఇందుకు ఉదాహరణలు

- ఆత్మకూరు బ్రాంచ్‌లో నకిలీ పట్టాలతో రుణాలు తీసుకున్నట్లు తేలినా బాధ్యులైన ఉద్యోగులపై చర్యలుగానీ, రుణాల రికవరీ గాని లేవు.
- కళ్యాణదుర్గం బ్రాంచ్‌లో 2008లో ఓ ఉద్యోగి బినామీ పేర్లతో రుణాలు ఇచ్చాడు. తర్వాత ఆ ఉద్యోగి వేరే ఉద్యోగానికి వెళ్లాడు. సుమారు రూ.30లక్షలు నిధులు దుర్వినియోగమైనట్లు తేల్చారు. ఇప్పటి వరకు ఆ ఉద్యోగి నుంచి నయా పైసా కూడా రికవరీ చేయలేదు.

ఇలా ఒకే స్థానంలో ఏళ్లుగా ఉన్న అధికారుల నిర్వాకంతో రైతులు, పేదల బ్యాంకుగా ఉన్న ఏడీసీసీబీ అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అక్రమార్కులను కాపాడేందుకు బ్యాంకులోని ఉన్నత స్థానంలోని కీలక అధికారులే యత్నిస్తుండటం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఫెవికాల్ వీరులు కదలరా..?

ఏడీసీసీ బ్యాంకులో కొందరు అధికారులు, ఉద్యోగులు ఒకే సీట్లో ఏళ్లుగా పాతుకుపోయారు. పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్న జాయింట్ కలెక్టర్ బ్యాంకులో వివిధ స్థాయిలో పాతుకుపోయిన ఉద్యోగులను ఇటీవల బదిలీ చేశారు. వీరిలో పదేళ్లకు పైగా పాతుకుపోయిన వారే అధికంగా ఉన్నారు. బదిలీ చేసిన వారిలో కొందరు ఆయా స్థానాల్లో చేరిపోయారు. పాతూరు బ్రాంచ్‌కు బదిలీ చేసిన ఓ సీనియర్ మేనేజర్ సుమారు 20ఏళ్లుగా ఒకే సీట్లో ఉన్నా, దాన్ని వదలకుండా అలాగే ఉండిపోయారు. డీజీఎంలుగా ఉన్న మరో ముగ్గురు అధికారులు కూడా సుమారు 15ఏళ్లుగా అక్కడే ఉంటున్నారు. ఏజీఎం స్థాయిలో ఉన్న మరో అధికారి కూడా పదేళ్లకుపైగా ఒకే స్థానంలో కొనసాగుతున్నారు. గతంలో సీఈఓగా, జీఎం గా పనిచేసిన విజయచంద్రారెడ్డి హైదరాబాద్ శిక్షణా కేంద్రానికి బదిలీపై వెళ్లి... మూడేళ్ల తరువాత తిరిగి వచ్చి డీజీఎంగా బాధ్యతలు చేపట్టడం చర్చనీయాంశంగా మారింది.

మేం వెళ్లం

అధికారులు, ఉద్యోగులు ఏళ్లుగా ఒకే స్థానంలో కొనసాగుతుండటంతో వారి మధ్య చిచ్చురేగుతోంది. ఆధిపత్యం కోసం ఏడీసీసీ బ్యాంకులో ఉద్యోగులను వర్గాలుగా విభజించారు. ఓ వైపు ఉద్యోగుల సంఘాల ప్రభావంతో మనస్పర్థలు ఏర్పడుతున్నాయి. బ్యాంకు కోసం ఎంతో కష్టపడ్డాం. ఎంతో పనిచేశాం. బదిలీ చేయకుండా ఇక్కడే ఉంచాలని ఉద్యోగ సంఘాల పేరుతో కొందరు ముందుకువస్తున్నారు. దీంతో బదిలీ అయిన ఉద్యోగులు రిలీవై వెళ్లకుండా అలాగే అంటి పెట్టుకున్నారు. పదేళ్లకు పైగా ఒకే స్థానంలో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీపై వెళ్లేందుకు ససేమిరా అంటుండటం ఆశ్చర్యం కలిగించే అంశం.

వైసీపీ పాలనలో బ్యాంకుకు తీవ్ర నష్టం

వైసీపీ పాలనలో సహకార బ్యాంకులు, సహకార సొసైటీలు నీరుగారిపోయాయి. అధికారులు, ఉద్యోగులు ఒకే స్థానంలో అంటిపెట్టుకుపోవడంతో తమకు కేటాయించిన విధులు, లక్ష్యాలకు తూట్లు పొడిచారు. ఐదేళ్లలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోగా నామినేటెడ్ పద్ధతిన పర్సన్ ఇన్‌చార్జిలను నియమించారు. దీంతో రెగ్యులర్ పాలకవర్గాలు తీసుకున్నంత బాధ్యత వారు తీసుకోలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో అనంతపురం బ్యాంకు చివరి స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో ఉన్న కృష్ణా జిల్లా రూ.10వేల కోట్ల టర్నోవర్‌లో ఉండగా....అనంతపురం రూ.1800కోట్లు మాత్రమే టర్నోవర్ చేస్తోంది. అయితే బ్యాంకు పురోగతి, టర్నోవర్ పెంచాలనే దృఢ సంకల్పం ఏ ఒక్క ఉద్యోగిలో కనపడకపోవడం గమనార్హం.

కొత్త సీఈఓపై వీడని ఉత్కంఠ

ఏడీసీసీ బ్యాంకుకు కొత్త సీఈఓ నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం-ఆప్కాబ్ గతేడాది నవంబరులో ఇంటర్వ్యూలు నిర్వహించాయి. జరిగాయి. అయితే ఇప్పటి వరకు కొత్తగా రెగ్యులర్ సీఈఓ నియామకంపై ఆప్కాబ్ నుంచి స్పష్టత లేదు. అనంతపురం నుంచి ఇంటర్వ్యూకు ప్రస్తుతం సీఈఓగా ఉన్న అధికారిణితో పాటు మరో వ్యక్తి హాజరయ్యారు. వీరిద్దరూ సీఈఓగా పనిచేశారు. అయితే ఎవరిని సీఈఓగా నియమిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది.

బదిలీ చేస్తాం



దీర్ఘకాలికంగా ఒకే స్థానంలో ఉన్న అధికారులను బదిలీ చేయాలని అటు ఆప్కాబ్, ఇటు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఆప్కాబ్, ఆర్బీఐ నిబంధనల మేరకే బ్యాంకుల నిర్వహణ, ఉద్యోగుల కార్యకలాపాలు అమలు చేస్తున్నాం. నిబంధనల ప్రకారం ఎంతటి ఉద్యోగి అయినా నడుచుకోవాలని సూచించాం. ఇందులో ఏ ఒక్కరికీ మినహాయింపులు ఉండవు. బ్యాంకు పురోగతికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నాం. నకిలీ పట్టాలకు రుణాలు ఇచ్చిన ఘటన విచారణలో ఉంది. అది ఉన్నతాధికారుల పరిధిలోని అంశం. విచారణలో అవినీతి జరిగినట్లు తేలితే బాధ్యులపై ఉన్నతాధికారులే నిర్ణయం తీసుకుంటారు.

- సురేఖరాణి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ

నేడు ఉపాధి శ్రామికులకు సన్మానం

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలను శ్రామికులు గుర్తించి, గురువారం కార్మిక దినోత్సవం సందర్భంగా సన్మానించనున్నారు. జిల్లా నుంచి పది మంది ఉపాధి శ్రామికులు రాజధాని అమరావతికి బుధవారం సాయంత్రం బయల్దేరి వెళ్లారు. ఉపాధి శ్రామికులు రామబ్రహ్మయ్య, ఓబయ్య, విజయ్‌కుమార్, కుళ్లాయప్ప, సుబ్బరాజు, నాగమల్లి, శ్రావణి, శిరీష, ఓబుళమ్మ, మనీష రాజధాని అమరావతిలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా సన్మానం అందుకోనున్నారు. మొదటి సారిగా ఉపాధి శ్రామికులను (కూలీలు) సన్మానించడం చాలా సంతోషంగా ఉందని డ్వామా పీడీ సలీంబాషా తెలిపారు.


అమరావతికి బయలుదేరిన ఉపాధి శ్రామికులతో డ్వామా పీడీ

వైభవంగా బసవేశ్వర జయంతి

6

పాలిసెట్ ప్రశాంతం



వైభవంగా బసవేశ్వర జయంతి

నగరోత్సవంలో అబ్బురపరిచిన ప్రదర్శనలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): బసవేశ్వరుడి 919వ జయంతి వేడుకలను జిల్లా వీరశైవ సమాజం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంలో బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నగరంలోని క్లాక్‌టవర్ నుంచి సప్తగిరి సర్కిల్, ఐరన్ బ్రిడ్జి మీదుగా పాతూరులోని పేట బసవేశ్వరస్వామి ఆలయం వరకు నగరోత్సవం నిర్వహించారు. శివుడు, వీరభద్రస్వామి వేషధారణలు, నందికోళ్ల కళా ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు, విన్యాసాలు అబ్బురపరిచాయి.

- క్లాక్‌టవర్ సమీపంలోని బసవేశ్వరస్వామి విగ్రహానికి వీరశైవ మహాసభ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి పూలమాలలు వేశారు. 12వ శతాబ్దంలోనే సమ సమాజ స్థాపనకు కృషిచేసిన జగజ్యోతి బసవేశ్వరస్వామి అని ఆయన అన్నారు. విశ్వగురువు, మహాయోగి బసవేశ్వరుడు చూపిన మార్గం యావత్ ప్రపంచం ఆచరించదగ్గదని అన్నారు.
- ప్రతి సంవత్సరం వైశాఖ మాస శుక్లపక్షం రోజున బసవేశ్వరుని జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నామని జిల్లా వీరశైవ సమాజం అధ్యక్షుడు ఎంజీ రాజు అన్నారు. బసవేశ్వరుడి వచనాలు మానవత్వానికి ప్రతీకలని, ఆయన నడిచిన మార్గంలో మనమందరం నడుద్దామని పిలుపునిచ్చారు. జిల్లా వీరశైవ సమాజం ప్రధాన కార్యదర్శి సతీష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు నాగన్న, కోశాధికారి మల్లికార్జున, మఠం తిప్పేస్వామి, ధనుంజయబాబు, సుశీల, ఇందిరా, లింగేశ్వరి, చంద్రశేఖర్, బిదుకార్ గంగాధర్, నాగార్జున, వీరేష్, రవికుమార్, శివకోటి రాంభూపాల్, చిరంజీవి, విజయ్‌కుమార్ చౌదరి, సుదేవ్ తదితరులు పాల్గొన్నారు.


బసవేశ్వర జయంతి వేడుకల్లో వీరశైవులు






శివ తాండవం చేస్తున్న కళాకారుడు.. విన్యాసం చేస్తున్న వీరభద్రుడి వేషధారి

మనిషి రూపంలో ఉన్న దేవుడు బసవేశ్వరుడు : కలెక్టర్


బసవేశ్వరుడి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మనిషి రూపంలో ఉన్న దేవుడు బసవేశ్వరుడని కలెక్టర్ వినోద్‌కుమార్ కొనియాడారు. బసవేశ్వరుడి జయంతిని బుధవారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, పూజలు చేసి కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు, ఉద్యోగులు నివాళులు అర్పించారు. కలెక్టరు మాట్లాడుతూ బసవేశ్వరుడు ఊరూరు తిరుగుతూ సమాజాన్ని సరిదిద్దే కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కవిగా, తాత్వికుడిగా, గురువుగా, సాంఘిక సంస్కర్తగా సమాజంలో కీర్తించబడ్డారన్నారు. కులాలు, మతాలకు అతీతంగా సమాజశ్రేయస్సు కోసం నిరంతరం పాటుపడ్డారన్నారు. ఆయన చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడవాలని కలెక్టరు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, జిల్లా టూరిజం అధికారి జయకుమార్, డీపీఓ నాగరాజునాయుడు, జడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు యుగేశ్వరి, అలెగ్జాండర్, వసంతలత తదితరులు పాల్గొన్నారు.

ఇష్టమైతే పాకిస్థాన్‌కే వెళ్లిపోవచ్చు



- ఇక్కడ తిని.. వారిని పొగుడుతారా?
- ఉగ్రవాదులకు నరకం తప్పదు
- గణపతి సచ్చిదానందస్వామి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): 'దేశంలో మారణహోమాన్ని సృష్టిస్తున్న పాకిస్థాన్ మంచిదేనని ఇప్పటికీ మనదేశంలో కొందరు పేర్కొనడం శోచనీయం. పాకిస్థాన్‌పై అంతటి ఇష్టం ఉన్నపుడు వారు కూడా దేశాన్ని వదిలి పాకిస్థాన్‌కు వెళ్లిపోవచ్చు' అని దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీ అన్నారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని దత్తమందిరంలో బుధవారం నిర్వహించిన విగ్రహ పునఃప్రతిష్ఠ వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పహల్గాం ఘటనపై స్పందించారు. భూతల స్వర్గమైన కశ్మీర్ అందాలను వీక్షించేందుకు వెళ్లిన పర్యాటకులను ఉగ్రవాదులు చంపడం దుర్మార్గమని అన్నారు. ధర్మం అడిగి చంపడం మనసుకు చాలా బాధ కలిగిస్తోందని, గతంలో ధర్మం విషయంలో చంపడమనేది ఎక్కడా జరగలేదని అన్నారు. కొత్తగా వివాహ బంధంతో ఒక్కటైన జంటలు విహారయాత్రకు వెళితే.. నవ వధువు కళ్లముందే భర్తను కాల్చి చంపడం అత్యంత బాధాకరమని అన్నారు. ఈ దారుణానికి పాల్పడినవారిని భారత ప్రభుత్వం వీలైనంత త్వరగా శిక్షించాలని ప్రార్థిస్తున్నానని అన్నారు. దాయాది దేశస్థులకు స్నేహముండాలే తప్ప క్రోధముండకూడదని అన్నారు. ఈ దేశానికి చెందినవారే కొందరు ఈ దేశం తిండి తింటూ, ఇక్కడి నీళ్లు తాగుతూ, ఇక్కడ గాలి పీలుస్తూ పాకిస్థాన్‌ను పొగుడుతూ, భారతీయుల మనసులను ఎందుకు కష్టపెడుతున్నారో వారికే తెలియాలని అన్నారు. మనం శాంతియుతంగా శాంతి, ధర్మాన్ని అనుసరిస్తుంటే పాకిస్థానీయులు మనల్ని తక్కువ అంచనా వేస్తున్నారని అన్నారు. మనం ఏ ధర్మంలో పుట్టామో చచ్చే వరకూ అదే ధర్మాన్నే అనుసరించాలి తప్ప వేరే ధర్మానికి మారకూడదని, దీనిని భావితరాలకూ నేర్పాలని సూచించారు. మనలో రాగద్వేషాలు, కోపతాపాలు లేకుండా అంతరూ కలిసికట్టుగా ధర్మ రక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. భారతీయులను బాధకు గురిచేసే పాకిస్థానీయులకు తప్పకుండా దేవుడు నరకప్రాప్తి కలిగిస్తాడని అన్నారు.

అక్షయ విశ్వాసం

కిటకిటలాడిన బంగారం దుకాణాలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


దుకాణంలో ఆభరణాలు ధరించి.. ఆనందంగా..

అనంతపురంలోని ఓ దుకాణంలో సందడి



బంగారు ఆభరణాల దుకాణాలు బుధవారం కళకళలాడాయి. అక్షయ తృతీయను పురస్కరించుకుని జిల్లా ప్రజలు బంగారాన్ని కొనేందుకు ఎగబడ్డారు. సాధారణంగా ఉదయం 10 గంటల తరువాత తెరుచుకునే దుకాణాలను వ్యాపారులు గంట ముందుగానే తెరిచారు. కొత్త కొత్త డిజైన్లు, ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. బంగారం ధరలు భారీగా ఉన్నా.. ఈ రోజున కొంటే సంపద పెరుగుతుందన్న విశ్వాసంతో చాలామంది తమకు వీలైనంత కొనుగోలు చేశారు. సందడి ఎంతున్నా.. ఈ ఏడాది వ్యాపారాలు ఆశించిన స్థాయిలో లేవని వ్యాపారులు అన్నారు. అక్షయ తృతీయను పురస్కరించుకుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతపురం హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి, అనంత ఐశ్వర్యేశ్వరస్వామికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో పుష్పార్చనలు, సామూహిక అనంత ఐశ్వర్యేశ్వర స్వామి వ్రతాలు నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నప్రసాదం అందించారు. సాయంత్రం స్వామివారి కీర్తనలు ఆలపించారు. భజన చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మఠం బసవరాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్


హెచ్చెల్సీ కాలనీ మంజునాథస్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకరణలో అనంత ఐశ్వర్యేశ్వర స్వామి


కౌంటర్లన్నీ బిజీ బిజీ

పాలిసెట్ ప్రశాంతం

88.69 శాతం హాజరు

ఆలస్యంగా వచ్చినవారికి నో ఎంట్రీ

సెంటర్ల వద్ద ప్రైవేటు కాలేజీల వేట




హమ్మయ్య పరీక్ష రాసేశాం అంటూ బయటకు వస్తున్న విద్యార్థులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల ప్రవేశాలకోసం బుధవారం నిర్వహించిన పాలిసెట్-2025 పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 88.69 శాతం విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 14,242 మంది దరఖాస్తు చేసుకోగా, 12,632 మంది హాజరయ్యారని సెట్ సమన్వయకర్తలు జయచంద్రారెడ్డి, సురేష్‌బాబు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 37 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా, పరీక్ష కేంద్రాలకు ఆలస్యంగా వచ్చిన కొందరు విద్యార్థులకు అనుమతి లభించలేదు. దీంతో నిరాశగా వెనుదిరిగారు. హడావుడిలో కొందరు హాల్‌టిక్కెట్స్, పెన్సిల్, ఎరేజర్లను తెచ్చుకోవడం మరచిపోయారు. పరీక్షా కేంద్రాలవద్దకు వచ్చి కంగారుపడ్డారు. సమీపంలోని జిరాక్స్, నెట్ సెంటర్లకు వెళ్లి హాల్ టిక్కెట్స్ తెచ్చుకున్నారు. పెన్సిల్, ఎరేజర్లను పరీక్ష కేంద్రాల వద్ద కొందరు సిబ్బంది, ఇతరులు సమకూర్చారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పరీక్షా కేంద్రాల వద్ద తాగు నీరు, వైద్య సిబ్బందిని ప్రభుత్వం అందుబాటులో పెట్టింది.

ఆలస్యం.. మరిచిపోయాం..

పరీక్ష ఉదయం 11 గంటలకు కాగా, చాలామంది విద్యార్థులు 9 గంటల నుంచే కేంద్రాలకు వచ్చారు. అధికారులు, సిబ్బంది హాల్ టిక్కెట్‌లను పరిశీలించి గదుల్లోకి అనుమతించారు. కొందరు 11 గంటలు దాటిన తరువాత వచ్చారు. అప్పటికే పరీక్ష మొదలైంది. రెండు, మూడు నిమిషాలు మాత్రమే మినహాయింపునిచ్చి అనుమతించారు. ఆ తరువాత వచ్చిన విద్యార్థులను అనుమతించలేదు. విభిన్న ప్రతిభావంతులు తొమ్మిదో తరగతి విద్యార్థులను స్క్రైబ్‌గా తెచ్చుకున్నారు. సదరం సర్టిఫికెట్స్‌లో తక్కువశాతం వైకల్యం ఉన్నవారికి, రిజిస్ట్రేషన్ చేసుకోని వారికి స్క్రైబ్‌ను అధికారులు అనుమతించలేదు.

అప్పుడే వేట..

పరీక్షా కేంద్రాల వద్ద ప్రైవేట్ విద్యాసంస్థల సిబ్బంది విద్యార్థుల వివరాలను సేకరించారు. తమ కాలేజీలలో చేరాలని ఎర వేస్తూ కనిపించారు. చదువు, హాస్టల్ అన్నీ ఉచితమని, ఏ కోర్సులోనైనా చేరవచ్చునని చెబుతూ కరపత్రాలను పంచారు. కౌన్సెలింగ్ సమయంలో తమను సంప్రదిస్తే సలహాలిస్తామని అన్నారు. ఫలితాలు రాకనే ఈ గోల ఏమిటని తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేశారు. 'చేరేదాకా ఉచితం అంటారు. ఆ తరువాత సాకులు చెప్పి డబ్బులు గుంజుతారు..' అని విమర్శించారు.


మా రూం ఎక్కడబ్బా..?


విద్యార్థులకు పెన్సిల్స్ అందజేస్తున్న కానిస్టేబుల్ లింగ


పరుగులు పెడుతున్న విద్యార్థులు


బయట తల్లిదండ్రుల నిరీక్షణ

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు


నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తాను మరణించినా మరో ఇద్దరికి చూపును ఇచ్చాడు పట్టణంలోని చంద్రబాబునగర్‌కు చెందిన పామిశెట్టి గోపాల్(61). ఈయన గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న విశ్వదీపసేవాసంఘం వారు గోపాల్ కుటుంబ సభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. వారి అనుమతితో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటి రెట్రోవైల్ సెంటర్ టెక్నీషియన్ రాఘవేంద్ర ఆధ్వర్యంలో పామిశెట్టి గోపాల్ నేత్రాలను సేకరించారు. నేత్రదానంతో మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం కలిగిందని సేవా సంసంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో విశ్వదీపసేవాసంఘం వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఖమ్మం మాధవ, జూజురు రఘు, కేశవరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

టీబీ డ్యాంకు కొత్తగేట్లు అమర్చాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



మాట్లాడుతున్న జగదీశ్

అనంతపురం విద్య, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర ఆనకట్టకు యుద్ధ ప్రాతిపదికన కొత్త గేట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీశ్ డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గసభ్యుడు నారాయణస్వామి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జగదీశ్ మాట్లాడుతూ గత ఏడాది తుంగభద్ర ఆనకట్ట 19వ గేటు కొట్టుకుపోయిందన్నారు. డ్యాం 33 గేట్లు శిథిలావస్థకు చేరాయని అప్పడే నిపుణులు గుర్తించారన్నారు. ఇంజనీరింగ్ నిపుణులు కన్నయ్య నాయుడు కూడా డ్యాం గేట్లు వెంటనే మార్చాలని తుంగభద్ర బోర్డుకు నివేదిక ఇచ్చారన్నారు. కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాలకు అత్యంత కీలకమైన డ్యాం విషయంలో కేంద్రం నిర్లక్ష్యం వీడాలన్నారు. కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయకార్యదర్శులు మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యులు రాజారెడ్డి, సంజీవప్ప, శ్రీరాములు, రామకృష్ణ, గోపాల్, కేశవరెడ్డి, నాగార్జున, వీరభద్రస్వామి, సంతోష్, కుళ్లాయిస్వామి, నాగరాజు, పెద్దయ్య, చిన్నప్ప యాదవ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

నిధులు వచ్చేశాయ్

వివిధ సామాజిక వర్గాల భవనాలకు రూ3.20 కోట్లు జమ

ఉరవకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఏడాది కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఉరవకొండలో కొన్నేళ్లుగా ఆగిపోయిన పనులకు మోక్షం లభించనుంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవచూపి, 10 సామాజిక వర్గాలకు చెందిన భవనాలు, కల్యాణ మండపాల నిర్మాణానికి రూ.3.20కోట్లు విడుదల చేయించారు. ఆ నిధులు పది రోజుల కిందట పంచాయతీ ఖాతాల్లోకి జమ అయినట్లు తెలిసింది. దీంతో ఆగిపోయిన నిర్మాణాలు పూర్తి కావడానికి మార్గం ఏర్పడింది. 2019లో టీడీపీ హయాంలో రూ.40లక్షలతో షాదీఖానా నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వం మారిపోవడంతో అది మొండి గోడలకే పరిమితమైంది. దానిని వైసీపీ ఐదేళ్లు ప్రచారం కోసం వాడుకుంది తప్పా, ఎలాంటి పనులూ చేపట్టలేదు. తాజాగా నిధులు మంజూరు కావడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆగిపోయిన షాదీఖానా

సామాజిక భవనం	మంజూరైన నిధులు (రూ.లక్షల్లో)
వాల్మీకి కల్యాణమండపం	50
కురుబ కల్యాణమండపం	50
ముస్లింల షాదీఖానా	50
నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనం	30
భద్రావతి, భావనారుషీంద్ర భవనం	30
కృష్ణదేవరాయల కల్యాణమండపం	20
ఎస్సీ సామాజిక వర్గం భవనం	25
ఎస్సీ సామాజిక వర్గం భవనం(మాల)	25
కార్పెంటర్ల షెడ్	25
యాదవ కమ్యూనిటీ హాల్	15

ఆర్డీటీకి ఇబ్బందులు తొలగించండి

విదేశీ విరాళాల సేకరణకు అనుమతి ఇప్పించండి

ముఖ్యమంత్రికి జిల్లా ఎమ్మెల్యేల వినతి



సీఎంకు వినతి పత్రం అందజేస్తున్న ప్రభుత్వ విప్, జిల్లా ఎమ్మెల్యేలు

అనంతపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాయలసీమతో పాటు అత్యంత వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి విశేష సేవలందిస్తున్న ఆర్డీటీకి విదేశీ విరాళాల సేకరణకు కేంద్రం నుంచి అనుమతి ఇప్పించాలని జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కోరారు. సచివాలయంలో బుధవారం ముఖ్యమంత్రిని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, బండారు శ్రావణిశ్రీ కలిసి వినతి పత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లాతో పాటు కర్నూలు, ప్రకాశం జిల్లాల పరిధిలోని వేలాది కుటుంబాలకు ఆర్డీటీ ద్వారా విద్య, వైద్య సేవలతో పాటు మౌలిక వసతులు అందుతున్నాయన్నారు. వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ సంస్థకు విదేశీ విరాళాల నియంత్రణ చట్టం కింద మంజూరు చేసిన అనుమతి పత్రాన్ని పునరుద్ధరించేలా చూడాలని కోరారు. రిజిస్ట్రేషన్ రెన్యువల్ కాకపోవడంతో సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిధుల కొరతతో ఆగిపోయాయన్నారు. ఆరు దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న సంస్థ కార్యక్రమాలు ఆగిపోతే దాదాపు మూడు వేల మంది సిబ్బంది బజారున పడుతారన్నారు. బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు ఆస్పత్రుల ద్వారా రోజువారీ 2 వేల మంది రోగుల వైద్యసేవలకు విఘాతం కలుగుతుందన్నారు. అదే విధంగా 5600 మంది పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక చేయూత నిలిచిపోతుందన్నారు. 50 పాఠశాలలు మూతపడటంతో పాటు 628 మంది దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆర్డీటీ లైసెన్సు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సీఎం చంద్రబాబు స్పందిస్తూ... ఆర్డీటీ లైసెన్సు పునరుద్ధరణకు కేంద్రానికి లేఖ రాయడంతో పాటు కేంద్ర పెద్దలతో మాట్లాడుతానని హామీ నిచ్చారు. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ద్వారా కేంద్రానికి తన లేఖను అందజేయాలని జిల్లా ఎమ్మెల్యేలకు సూచించారు.

అమరావతితో బంగారు భవిష్యత్తు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంతోనే భావితరాలకు బంగారు భవిష్యత్తు ఉంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాజధాని అమరావతి విధ్వంసానికి గురైందన్నారు. దాన్ని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమరావతి 2.0కు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ నెల 2న ప్రధానమంత్రి నరేంద్రమోదీ రూ.43 వేల కోట్ల పనులకు ప్రారంభోత్సవం చేయనున్నారన్నారు. ప్రజా రాజధాని అమరావతి పూర్తయితే 175 నియోజకవర్గాల్లోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. మోదీ చేతుల మీదుగా జరిగే ప్రజా రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు అనుకున్న లక్ష్యం ప్రకారం పూర్తయితే ప్రపంచం గర్వించే రాజధానిని ప్రజలంతా చూస్తారన్నారు. రాజధాని నిర్మాణంతో పాటు రాష్ట్రంలోని మూడు ప్రాంతాల సమానాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం సహకారంతో ముందుకు వెళ్తోందన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో అమరావతిని కుప్పకూల్చి ఎక్కడి పనులు అక్కడ ఆపేశారన్నారు. జగన్‌రెడ్డి తీసుకున్న మూడు రాజధానుల ప్రతిపాదన కారణంగా పెట్టుబడులు గణనీయంగా పడిపోయి రాష్ట్ర వ్యాప్తంగా భూముల విలువ పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ నిర్వాకం వల్ల రూ. 2 లక్షల కోట్ల విలువైన 130 పరిశ్రమలు, ప్రఖ్యాత వ్యాపార, విద్యా సంస్థలు పొరుగు రాష్ట్రాలకు తరలిపోయాయన్నారు. దీంతో లక్షలాది మంది యువత ఉద్యోగాలు కోల్పోయారని గుర్తు చేశారు. రైతుల ప్రాణత్యాగాలు, న్యాయస్థానాల జోక్యంతో రాజధాని అమరావతి చెక్కు చెదరకుండా నిలబడిందన్నారు. ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంకుల నుంచి తెచ్చిన నిధులతో అమరావతి పనులు వేగం పుంజుకుంటున్నాయన్నారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీధర్ చౌదరి, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు, రాష్ట్ర కార్యదర్శులు గాజుల ఆదెన్న, రామలింగారెడ్డి, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గౌస్‌మొద్దీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

చీనీ టన్ను రూ. 22వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 22,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 2,500, సరాసరి రూ. 14వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1017 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

క్రమబద్ధీకరణపై కసరత్తు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ, అనుబంధ శాఖల రైతు సేవా కేంద్రాల సిబ్బంది, ఎంపీఈఓల క్రమబద్ధీకరణపై బుధవారం రెండో రోజు కసరత్తు కొనసాగింది. స్థానిక జేడీఏ కార్యాలయంలో ఉమ్మడి జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ శాఖల అధికారులు సమావేశమై క్లస్టర్ల వారిగా ఏఏ పంటలు సాగవుతున్నాయి..? ఏఏ ప్రాంతంలో ఏ శాఖ సిబ్బందిని నియమించాలన్న దానిపై సమాలోచనలు జరిపారు. మరో రెండు రోజుల్లో ఈ ప్రక్రియ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని జేడీఏ కార్యాలయ వర్గాలు పేర్కొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం విద్య, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేజీబీవీలలో నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకోడానికి మే 3వ తేదీ వరకూ పొడిగించినట్లు సమగ్రశిక్ష ప్రాజెక్టు ఏపీసీ శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుల గడువు బుధవారం వరకూ ఉండగా మరో మూడు రోజులు పొడిగించామన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ మండలంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో 3వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను సమర్పించాలన్నారు.

8 నుంచి ఎస్కేయూ పీజీ, బీటెక్ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో 8వ తేదీ నుంచి పీజీ, బీటెక్, ఎంసీఏ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ తెలిపారు. పీజీలోని ఆర్ట్స్ కోర్సుల నాల్గవ సెమిస్టర్ విద్యార్థులకు 13వ తేదీ వరకు పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. బీటెక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ రెండో సెమిస్టర్ విద్యార్థులకు 22 వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఎంసీఏ విద్యార్థులకు ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ఉంటాయని వివరించారు. ఎంబీఏ విద్యార్థులకు శుక్రవారం నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను కళాశాలలో తీసుకోవాలని సూచించారు.

డీఆర్‌డీఏ పీడీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా శైలజ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా ఉన్న ఈశ్వరయ్య ఉద్యోగ విరమణ పొందారు. దీంతో సమగ్ర శిక్ష ఏపీసీగా ఉన్న శైలజకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం డీఆర్‌డీఏ-వెలుగు పీడీగా శైలజ బాధ్యతలు స్వీకరించారు. ఉద్యోగులు కొత్త, పాత పీడీలకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. శైలజ ఇదివరకు డ్వామాలో ప్లాంటేషన్ మేనేజర్‌గా పని చేసిన సంగతి తెలిసిందే.

పలు ప్రాంతాల్లో వర్షం



అనంతపురంలోని శీకంఠం సర్కిల్ వద్ద వర్షం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం రాత్రి వర్షం కురిసింది. అనంతపురం, యాడికి, బొమ్మనహాల్ మండలాల్లో ఓ మోస్తారు వర్షం పడింది. గుత్తి, నార్పల, ఉరవకొండ, శింగనమల, పుట్లూరు, పెద్దవడుగూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

ఒకరు.. ఇద్దరే...!

పంచాయతీ సమావేశాలకు సభ్యుల డుమ్మా



మొదటి నోటీసుతో సమావేశానికి హాజరైన ఒకే ఒక్క వార్డుమెంబరు

కోరం లేక రెండుసార్లు వాయిదా
రేపు మూడోసారి నిర్వహణకు యత్నం
యాడికి పంచాయతీలో ముసలం



రెండోసారి సమావేశానికి హాజరైన ఇద్దరు వార్డుమెంబర్లు

యాడికి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ అయిన యాడికిలో ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. యాడికి గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహణే ఇందుకు నిదర్శనం. ఈ ఏడాది మార్చి 3న సర్పంచు అనురాధ అధ్యక్షతన గ్రామపంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఒకే ఒక్క వార్డు మెంబరు మాత్రమే హాజరయ్యారు. సమావేశం నిర్వహణకు కోరం లేకపోవడంతో వాయిదా వేశారు. రెండోసారి మార్చి 5న సమావేశం నిర్వహిస్తున్నట్లు సభ్యులందరికి నోటీసులు పంపించారు. ఈ సమావేశానికి సర్పంచు అనురాధ, ఇద్దరు వార్డు మెంబర్లు మాత్రమే హాజరయ్యారు. దీంతో రెండోసారి కూడా సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో మూడోసారి మే2న పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సభ్యులందరికి పంచాయతీ కార్యదర్శి నోటీసులు పంపించారు. ఈ సమావేశానికైనా సభ్యులు హాజరవుతారా లేదా డుమ్మా కొడతారా అనేది ప్రశ్నార్థకంగానే ఉంది.

ఎమ్మెల్యేని కలవడంతోనే ...

వైసీపీ మద్దతుతో గెలిచిన సర్పంచు అనురాధ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తాడిపత్రిలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డిని కలిశారు. దీంతో పంచాయతీ పాలకవర్గంలో విభేదాలు తలెత్తినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. పంచాయతీ అభివృద్ధి కోసమే తాను ఎమ్మెల్యేను కలిశానని సర్పంచు అనురాధ చెబుతున్నారు. అయినా వైసీపీ మద్దతుదారులుగా ఉన్న వార్డు సభ్యులు దీన్ని జీర్ణించుకోలేక పంచాయతీ పాలకవర్గ సమావేశానికి గైర్హాజరవుతున్నారనే చర్చ జరుగుతోంది. గ్రామపంచాయతీలో నెలకొన్న వివిధ సమస్యల పరిష్కారం కోసం తీర్మానం చేయడానికి పంచాయతీ పాలకవర్గ సమావేశం తప్పనిసరిగా నిర్వహించాల్సి ఉంటుంది. 20మంది వార్డు సభ్యులు ఉన్న యాడికి గ్రామ పంచాయతీలో పాలవకర్గ సమావేశానికి కోరం లేకపోవడం ఏమిటని, ప్రజా సమస్యలపట్ల పాలకవర్గానికి ఉన్న చిత్తశుద్ధి ఇదేనా అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీలో సమస్యలు కోకొల్లలు

1. యాడికి గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ గ్రామాల్లో తాగునీటి సరఫరాచేసే మోటార్లు మరమ్మతులకు గురికావడం
2. గ్రామపంచాయతీ సిబ్బంది వేతనాలు చెల్లింపులు
3. గ్రామ పంచాయతీలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపు
4. వీధిలైట్లు, డ్రైనేజీ నిర్వహణ, చెత్త తరలింపు ట్రాక్టర్ల డీజిల్ బిల్లుల చెల్లింపు తదితర అంశాలన్ని గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశంలో చర్చించాల్సి ఉంది.

మే2న నిర్వహించే పంచాయతీ పాలకవర్గ సమావేశం సజావుగా సాగుతుందో లేకపోతే దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో అధికారులే నిర్ణయించాల్సి ఉంది.

డీపీఓకు నివేదిక ఇస్తాం



పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామ పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహణను రెండుసార్లు కోరం లేక వాయిదా వేశాం. మూడోసారి సభ్యులందరికి నోటీసులు పంపించాం. సమావేశం నిర్వహణకు కోరం లేకపోతే జిల్లా పంచాయతీ అధికారికి నివేదికను పంపిస్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- అశ్వత్థమనాయుడు, పంచాయతీ కార్యదర్శి

నెల్లూరులో ఘోర ప్రమాదం

ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు వైద్య విద్యార్థుల మృతి

ధర్మవరం, అనంతలో విషాదం



అభిషేక్‌రాజ్ మృతదేహాన్ని చూసి విలపిస్తున్న సహ విద్యార్థులు

ధర్మవరం రూరల్/కోవూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు వైద్య విద్యార్థులు మృతిచెందారు. అనంతపురం నగర శివారులోని శిల్పా లేపాక్షి నగర్‌కు చెందిన కిమావత్ రవి నాయక్ కుమారుడు కిమావత్ అభిషేక్ రాజ్, ధర్మవరం పట్టణంలోని లోనికోటకు చెందిన కేశవ్ నాయక్, బొజ్జమ్మ దంపతుల కుమారుడు నవదీయ నరేష్ నాయక్ మృత్యువాత పడ్డారు. దీంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. నెల్లూరు శివారులోని చింతారెడ్డిపాళెంలో ఉన్న నారాయణ మెడికల్ కళాశాలలో వీరు రెండో సంవత్సరం (2023వ బ్యాచ్) చదువుతున్నారు. బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన చక్రధర్ అక్క నిశ్చితార్థం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు చక్రధర్ స్నేహితులు 12 మంది ఉదయం రెండు కార్లలో బుచ్చిరెడ్డిపాళెంకు వెళ్లారు. మధ్యాహ్నం భోజనాలు పూర్తయ్యాక అందరూ కలిసి అవే కార్లలో తిరుగు ప్రయాణమయ్యారు. పోతిరెడ్డిపాళెం సమీపంలో ఒక కారు అతివేగంతో అదుపుతప్పింది. కారు నడుపుతున్న జీవన్‌చంద్రారెడ్డి బ్రేక్ వేసినా కుదరలేదు. హైవే పక్కనే ఓ పూరింటిలోకి దూసుకెళ్లింది. దీంతో ఇంట్లో సేద తీరుతున్న నిడిగుంట రమణయ్య(65) అక్కడికక్కడే మృతి చెందాడు. కారు నుజ్జునుజ్జవగా, గుడిపై ధ్వంసమైంది. తీవ్రంగా గాయపడ్డ తమ స్నేహితులను వెనుక కారులో వస్తున్న మిగిలినవారు ఆస్పత్రులకు తరలించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరితోపాటు గుండాల జీవన్‌చంద్రారెడ్డి, గుర్రం యజ్ఞేష్, గోను అభిసాయి పురుషోత్తం అనే ఇతర జిల్లాల వైద్య విద్యార్థులు మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలియగానే జిల్లా నుంచి ఇద్దరు వైద్య విద్యార్థుల కుటుంబ సభ్యులు నెల్లూరుకు వెళ్లారు. తమ బిడ్డల మృతదేహాలను చూసి బోరున విలపించారు.



నరేష్ నాయక్ (ఫైల్)

కానరాని లోకాలకు 'డాక్టర్'

కొడుకు ఇంటికి వస్తే.. 'మా డాక్టర్ వచ్చినాడు..' అని బంధువులకు ఫోన్ చేసి చెప్పేవారు తల్లిదండ్రులు. తెల్లకోటు వేసుకుని రోగుల ప్రాణాలు కాపాడితే చూడాలనుకున్న వారి కలలు కల్లలయ్యాయి. ధర్మవరం లోనికోటకు చెందిన నరేష్‌నాయక్ మృతితో తల్లిదండ్రులు కేశవ నాయక్, బొజ్జమ్మ దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. కేశవ నాయక్ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు. ఒక్కగానొక్క కుమారుడు నరేష్ నాయక్ నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నారు. అదే జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెంలో సహవిద్యార్థి సోదరి నిశ్చితార్థం కోసం స్నేహితులతో కలిసి కారులో వెళ్లాడు. నిశ్చితార్థం ముగిసిన తర్వాత తిరిగి వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారు. నరేష్ నాయక్ తండ్రి సెంట్రింగ్ పనులు చేసుకుంటూ కుమారుడిని చదివిస్తున్నాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలియగానే కాలనీలో విషాదం అలుముకుంది. కొడుకు ఇంటికి వస్తే ఆ ఇంట్లో సందడి నెలకొనేదని పలువురు కంటతడి పెట్టారు.

బీటెక్‌లో 98 శాతం ఉత్తీర్ణత

ఫలితాలు విడుదల చేసిన జేఎన్టీయూ వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బీటెక్ నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్(ఆర్20) పరీక్షల్లో 98.62 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ మేరకు బుధవారం వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జేఎన్టీయూ పరిధిలోని విద్యార్థులకు బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ, ఎమ్మెస్సీ పరీక్షలు నిర్వహించామని అన్నారు. బీటెక్ నాలుగో సంవత్సరం ద్వితీయ సెమిస్టర్(ఆర్20) రెగ్యుల్ ఫలితాల్లో 98.62 శాతం మంది, ఎంసీఏ నాలుగో సెమిస్టర్(21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల్లో 92.15 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్(21) రెగ్యులర్, సప్లమెంటరీలో 88.47, ఎమ్మెస్సీ ప్రథమ సెమిస్టర్(21) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల్లో 85 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. విద్యార్థులు వారి ఫలితాల కోసం https://jntuaresults.ac.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ నాగప్రసాద్ నాయుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ శంకర్ రాజు, అంకారావు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

సీఐ పేరు చెప్పి సరుకులు

ముగ్గురు నిందితుల అరెస్ట్

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతూరు తిలక్‌రోడ్డులోని ఓ కిరాణా దుకాణంలో ముగ్గురు వ్యక్తులు సీఐ పేరు చెప్పి సరుకులు తీసుకెళ్లారు. ఆ ఘటనలో వన్‌టౌన్ పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో పాతూరులోని కిరాణాదుకాణానికి ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చారు. సరుకులు కట్టమన్నారు. రూ.3వేలు బిల్లయింది అని యజమాని చెప్పగా...టూటౌన్ సీఐ సర్‌కు అని...చెబితే అర్థం కాదా అని వేగంగా వెళ్లిపోయారు. ఈ ఘటనపై దుకాణ యజమాని అంబటి కల్యాణ్ చక్రవర్తి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన లక్ష్మీనారాయణ, రామగిరి మండలం పేఆర్ కొట్టాలకు చెందిన రవి, కనగానపల్లి మండలం నరసంపల్లికి చెందిన జశ్వంత్‌ను అరెస్ట్ చేశారు. వారిలో లక్ష్మీనారాయణ పలుసార్లు టోల్‌గేట్ల వద్ద అధికారుల పేర్లు చెప్పి బెదిరించాడని వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ తెలిపారు.

పార్కులో వీడియో వివాదం

యువతిపై దాడి .. పోలీసులకు ఫిర్యాదు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కులో ఓ యువతి వాకింగ్ చేస్తుండగా వీడియోలు తీశాడనే విషయంపై గొడవ చోటుచేసుకుంది. బుధవారం సాయంత్రం నగరానికి చెందిన రుక్సానా రాజీవ్‌చిల్డ్రన్స్ పార్కుకు వాకింగ్‌కు వెళ్లింది. పార్కుకు ప్రభు అనే వ్యక్తి తన భార్య, వదినతో కలిసి పార్కుకు వెళ్లాడు. రుక్సానా వాకింగ్ చేస్తుండగా...ఆమె వెనుకే ప్రభు భార్య, వదిన నడిచి వెళ్తున్నారు. వారిని ప్రభు వీడియో తీశాడు. ఆ సమయంలో తననెందుకు వీడియో తీస్తున్నావని రుక్సానా ప్రశ్నించింది. ఇందుకు ప్రభు తన భార్య, వదినను తీస్తున్నానని చెప్పాడు. దీంతో వివాదమెందుకుని వీడియో తీయవద్దని అతడి భార్య, వదిన చెప్పారు. కానీ మరోసారి వీడియో తీశాడు. దీంతో రుక్సానా వాదనకు దిగింది. ఈ గొడవ చివరకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరింది. తనపై ప్రభు, అతడి భార్య, వదిన దాడి చేసినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

3న ద్విచక్రవాహనాల వేలం

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 3వతేదీ 23 బైక్‌లను వేలం వేయనున్నట్లు సీఐ శాంతిలాల్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని సీఐ తెలిపారు.

49 గొర్రెల అపహరణ.. అదుపులో దొంగలు..?

అనంతపురం క్రైం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలో గొర్రెలు అపహరణకు గురయ్యాయి. కొడిమి గ్రామానికి చెందిన బండి ముసలన్న గ్రామ సమీపంలోని ఫక్రుద్దీన్ పొలంలో నాలుగు రోజుల క్రితం 500 గొర్రెలను తోలాడు. సోమవారం రాత్రి అందులో 49 గొర్రెలను అపహరించారు. ఈ ఘటనలో విచారణ చేపట్టిన అనంతపురం రూరల్ పోలీసులు దొంగలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. దొంగలు సమీప గ్రామస్తులేనని, ఇద్దరూ భార్యాభర్తలని సమాచారం.

చీనీ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు స్థల పరిశీలన

గార్లదిన్నె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంబులదిన్నె, కనుంపల్లి గ్రామాల్లో బుధవారం చీనీ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖ అధికారి అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణానికి రూ. 3.5 కోట్ల వ్యయంతో చీనీ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారులు ఫిరోజ్‌ఖాన్, రత్నకుమార్, మైక్రో ఇరిగేషన్ అధికారి రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

న్యూస్ బాక్స్

ఘనంగా వెంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవాల్లో మంగళసూత్రాలు చూపుతున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణం కోసం సోమనాథ్ నగర్‌లోని రామాలయంలో బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి, అలాగే సీతారాముల కల్యాణోత్సవాలను శాస్త్రబద్ధంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో స్వామివార్ల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి స్వామివార్ల కల్యాణోత్సవాలను నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం, అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వేణుగోపాలకృష్ణమూర్తి, మణూరు నాగరాజరావు, ఉమారాణి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పది ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

శింగనమల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు గురువారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ నరసింహరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు గురువారం నుంచి మే18 వ తేదీ వరకు శింగనమల, తరిమెల జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు ఉంటాయన్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తునట్లు తెలిపారు.

4న ఏపీజీఈఏ నగరశాఖ ఎన్నికలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నగరశాఖ ఎన్నికలు ఈ నెల 4వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోపీకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ఎన్నికలకు అధికారులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి రామునాయక్, సహాధ్యక్షుడు వేణుగోపాల్‌ను నియమించినట్లు తెలిపారు. కావున ఉద్యోగులు ఈ ఎన్నికల్లో పాల్గొని ఓటు వినియోగించుకోవాలని కోరారు.

గంగలకుంట కృష్ణయ్య నియామకంపై హర్షం



కృష్ణయ్యను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

రాప్తాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్‌గా నియమితులైన గంగలకుంట కృష్ణయ్యను టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. వారు బుధవారం గంగలకుంట గ్రామంలో కృష్ణయ్యను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కురుబ సాధికారసమితి రాష్ట్ర కన్వీనర్ గంగలకుంట రమణ, బీరన్న, బాబయ్య, రాగే మురళి, గేటు సత్తి, డీలర్ గంగాధర్, బుల్లే ఆది తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి

● కలెక్టర్‌కు సేవ్ ఆర్డీటీ జేఏసీ నాయకుల వినతి

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవల కొనసాగింపుకోసం చర్యలు చేపట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫారసు చేయడంతోపాటు ఆర్డీటీ ఆస్పత్రుల్లో అత్యవసర వైద్యసేవలు కొనసాగించేలా చర్యలు చేపట్టాలని సేవ్ ఆర్డీటీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం సేవ్ ఆర్డీటీ జేఏసీ కన్వీనర్ కేయం షకిల్ షఫి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, మాజీ మేయర్ స్వరూప కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎఫ్‌సీఆర్ఏ చట్ట సవరణను తీసుకొచ్చి ఆర్డీటీకి వస్తున్న నిధులకు ఆంక్షలు విధించారన్నారు. ఆర్డీటీ సేవలను నిలిపివేయడం వల్ల అన్ని రంగాల ప్రజలు నష్టపోతారని తెలిపారు. కాబట్టి ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని కోరారు. ఆర్డీటీ అంశాన్ని ప్రధాని దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్తుందనే నమ్మకం తమకు ఉందని, శుక్రవారం తర్వాత జేఏసీ ఆధ్వర్యంలో తదుపరి ప్రణాళికతో ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మచ్చా రామలింగారెడ్డి, న్యాయవాదులు ఇసాక్, ఆదెన్న తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు జీవితంలో భాగం కావాలి

● మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : మానవుడి నిత్య జీవితంలో పుస్తకాలు భాగం కావాలని, అపుడే మనం వైజ్ఞానిక సమాజాన్ని నిర్మించుకోగలమని మాజీ ఎమ్మెల్సీ జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి నిర్వహిస్తున్న పుస్తక వారోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ నేపథ్యంలో క్లాక్ టవర్ వద్ద నిర్వహించిన పుస్తక ప్రదర్శన ముగింపు కార్యక్రమంలో తొలుత శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ... ఒకప్పుడు సాహిత్యం అంటే వ్యక్తిగతమైనదిగా భావించేవారని, అలాంటి సాహిత్యంతో సమాజాన్ని మేల్కొలిపిన మహానుభావుడు శ్రీశ్రీ అని కొనియాడారు. సాహిత్య పఠనంలో శ్రీశ్రీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ తెలుగు అధ్యాపకుడు నాసీల నాగేంద్ర, జేవీవీ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రాము, కోశాధికారి మహ్మద్ జిలాన్, నాయకులు గాంగేనాయక్, విరూపాక్షి, రోగప్ప, నగర అధ్యక్ష కార్యదర్శులు రామిరెడ్డి, వీరరాజు, తిరుపాలు, రామకృష్ణ, ముత్యాలు, ప్రసాద్, ప్రసాద్‌రెడ్డి, బాబ్జాన్, ఎర్రిస్వామి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ నాయకత్వ అవార్డు ప్రదానం



అవార్డును అందుకున్న ఎండీ నాగభూషణం

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎండీ నాగభూషణానికి ప్రెస్‌క్లబ్ వెల్ఫేర్ వరల్డ్‌వైడ్ ఫౌండేషన్ అంతర్జాతీయ ఉత్తమ నాయకత్వ అవార్డును అందజేసింది. విశాఖపట్నంలో నిర్వహించిన వేడుకల్లో ఫౌండేషన్ ప్రతినిధులు అవార్డును అందజేసినట్లుని నాగభూషణం బుధవారం తెలిపారు.

నిరుపయోగంగా వాటర్ ట్యాంకులు

● నీరున్నా సరఫరా చేయని అధికారులు



జగనన్న కాలనీలో నిరుపయోగంగా ఉన్న మినీ వాటర్ ట్యాంకులు

రాప్తాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాప్తాడు సమీపంలో ఉన్న జగనన్న కాలనీలో మినీ వాటర్ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. ట్యాంకులకు నీరు సరఫరా చేయకపోవడంతో అవి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రాప్తాడు సమీపంలో పండమేటి వెంకటరమణస్వామి ఆలయం సమీపంలో రాప్తాడు, ప్రసన్నాయపల్లి గ్రామ ప్రజలకు దాదాపు 500 మందికి ఇళ్ల పట్టాలు అందజేశారు. ఆ స్థలంలో వారికి ప్రభుత్వం ఇళ్లు కూడా మంజూరు చేసింది. ఆ సమయంలో జగనన్న కాలనీలో తాగునీరు. ఇళ్ల నిర్మాణాల కోసం బోర్లు వేశారు. ప్రజలకు నీటి సౌకర్యార్థం కాలనీలో మెయిన్ రోడ్డు పక్కన 11 మినీ వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా పైపులైను వేసి ట్యాంకులకు కొళాయిలు కూడా అమర్చారు. ట్యాంకుల ఏర్పాటు, పైపులైన్ కనెక్షన్, కొళాయిల కోసం ప్రభుత్వం అప్పట్లో రూ. లక్షల్లో ఖర్చు చేసింది. ప్రస్తుతం ఆ వాటర్ ట్యాంకులకు నీరు సరఫరా కావడం లేదు. కాలనీలో కొంత మంది ఇళ్లు నిర్మించుకున్నారు. ఇంకా కొంత మంది నిర్మిస్తున్నారు. మరికొన్ని నిర్మించాల్సి ఉంది. ట్యాంకులకు నీరు సరఫరా చేస్తే నివాసం ఉన్న వారు, ఇళ్లు నిర్మించుకునేవారు ఏ సమయంలోనైనా నీరు ఉపయోగించుకోవచ్చు. ట్యాంకులు ఉన్నా వాటిలో నీరు లేకపోవడంతో ఇళ్లు నిర్మించుకునేవారు నీటి కోసం ఇబ్బంది పడే పరిస్థితి వస్తోంది. హౌసింగ్, పంచాయతీ అధికారులు స్పందించి జగనన్న కాలనీలో మినీ వాటర్ ట్యాంకులకు నీరు సరఫరా చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై రాప్తాడు హౌసింగ్ ఏఈ లావణ్యను వివరణ కోరగా వాటిని వెంటనే పరిశీలించి నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జయలక్ష్మి మాతకు ప్రత్యేక పూజలు



మాతృమూర్తి జయలక్ష్మీ మాత విగ్రహానికి పూజలు చేస్తున్న గణపతి సచ్చిదానందస్వామి

రాప్తాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మేపర్తి గ్రామంలో వెలసిన జయలక్ష్మీ మాత విగ్రహానికి గణపతి సచ్చిదానందస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం నుంచి బొమ్మేపర్తి ఆశ్రమంలో జయలక్ష్మీమాత జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు అనేక మంది హాజరయ్యారు. బుధవారం అక్షయ తృతీయ సందర్భంగా గణపతి సచ్చిదానందస్వామి జయలక్ష్మీమాతకు పలు రకాలు పూజలు చేశారు. భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణ చేశారు. గురువారం లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు.

'ఎస్ఈ రాజశేఖర్ వ్యక్తిత్వం ఆదర్శం'



పదవీ విరమణ పొందిన ఎస్ఈ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న సీఈ తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదవీవిరమణ పొందిన హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ వ్యక్తిత్వంతో ఇంజనీర్లు అందరికీ ఆదర్శంగా నిలిచారని జలవనరుల శాఖ సీఈ నాగరాజ కొనియాడారు. హెచ్చెల్సీ ఎస్ఈగా పదవీవిరమణ పొందిన ఎన్. రాజశేఖర్‌ను జలవనరుల శాఖ ఇంజనీర్లు, ఉద్యోగులు బుధవారం పూలమాలలు, శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జలవనరుల శాఖ సీఈ నాగరాజ, హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్, హెచ్చెల్సీ లోకలైజేషన్ ఈఈ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ... నిబద్ధత, నిజాయితీతో విధులు నిర్వహించి మచ్చలేని అధికారిగా పదవీవిరమణ పొందడం శుభసూచికమన్నారు. కార్యక్రమంలో హెచ్చెల్సీ ఈఈలు వెంకటేశ్వర్లు, శశికళ, హంద్రీనీవా ఈఈలు మురళి, శ్రీనివాసులు, విశ్రాంతి ఈఈ మోహన్ మూర్తి, డీఈలు, ఏఈలు, ఇంజనీర్లు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



ఉద్యోగి సూర్యనారాయణను సన్మానిస్తున్న డీఎస్ఓ, ఎస్ఓ తదితరులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టుపరిశ్రమ శాఖలో ఉద్యోగిగా సూర్యనారాయణ సేవలు ఆదర్శనీయమని సెరికల్చర్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ (డీఎస్ఓ) ఆంజనేయులు పేర్కొన్నారు. టెక్నికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ విరమణ పొందిన సూర్యనారణకు సెరికల్చర్ ఆఫీసర్ ఓబులేసు ఆధ్వర్యంలో సూర్యనారయణను ఘనంగా సన్మానించారు. అధికారులు పద్మమ్మ, మెహతాబి, రామలక్ష్మి, లక్ష్మి, రామలింగారెడ్డి, మునయ్య శ్రీనివాసులు, అంజనరెడ్డి, మాజీ డ్రైవర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ప్రీస్కూల్‌కు పలకల పంపిణీ

నార్పల, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సెక్షారు సుల్తాన్ పేట-1 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ పిల్లలకు కానిస్టేబుల్ దంపతులు బుధవారం పలకలను అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్త వరలక్ష్మికి కానిస్టేబుల్ గంగాధర్, చంద్రలేఖ దంపతులు పిల్లల కోసం పలకలను అందజేశారు. సహాయకురాలు గీత తదితరులు పాల్గొన్నారు.

ఏడీసీసీ, డీసీఎంఎస్ ఛైర్మన్లకు సన్మానం



శుభాకాంక్షలు తెలుపుతున్న వెంకటశివుడు యాదవ్ తదితరులు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టెం వెంకటేష్‌ను టీడీపీ జిల్లా కార్యాలయంలో బుధవారం సన్మానించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గాజుల ఆదెన్న, రామలింగారెడ్డి తదితరులు వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు కురబ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



● శింగనమల, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డిని టీడీపీ మండల నాయకులు సూచించారు. పార్టీ మండల కన్వీనర్ గత్తా ఆదినారాయణ, నాయకులు దేగలకృష్ణమూర్తి, గొర్ల మారుతినాయుడు, లాయర్ ఈశ్వర్‌రెడ్డి, చిదానందనాయుడు, సర్పంచ్ రాజు, గుర్రం లక్ష్మీనారాయణ, దాసరి గంగాధర్, పెద్ద నాగముని, పెద్దన్న, చెన్నయ్య, నాగభూషణ, నాగేంద్రప్రసాద్, నారాయణస్వామి, గరుడశేఖర్‌రెడ్డి తదితరులు ఆయనను బుధవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో కలిసి అభినందలు తెలిపారు.



● అనంతపురం సెంట్రల్: ప్రజా సమస్యలపై నిత్యం పనిచేస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిలో కార్యకర్తలకు పెద్దపీటవేస్తూ పదవులు అందజేయడం హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్ పేర్కొన్నారు. బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ ఛైర్మన్ నెట్టం వెంకటేష్, ఏడీసీసీ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డిని వేరువేరుగా కలిసి సన్మానించారు.

మార్కెట్ పాలకవర్గంలో రూరల్‌లోని ఐదుగురికి చోటు



నాగలక్ష్మి



సాలమ్మ



అనిల్ చౌదరి



బుల్లెట్ రఫి

అనంతపురం రూరల్, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మార్కెట్ యార్డు పాలక వర్గాన్ని ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రకటించిన విషయం విదితమే. ఇందులో అనంతపురం రూరల్ మండలం నుంచి ఐదుగురికి డైరెక్టర్లుగా చోటు దక్కింది. సోములదొడ్డి గ్రామానికి చెందిన జెన్నె నాగలక్ష్మి, పాపంపేటకు చెందిన దేవరకొండ సాలమ్మ, ఆలమూరు సర్పంచు గోనుగుంట్ల సౌమ్య, నరసనాయనికుంటకు చెందిన అనిల్ చౌదరి, సిండికేట్ నగర్‌కు చెందిన టీఎన్ఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు బుల్లెట్ రఫీకి చోటు కల్పించారు. కమిటీలో చోటు దక్కడం పట్ల సదరు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. అవకాశం కల్పించిన పార్టీ అధినాయకత్వానికి, ఎమ్మెల్యే పరిటాల సునీతకు, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నాయకులు



స్వాగతం పలుకుతున్న కూటమి సభ్యులు పవన్, రామాంజి, దామోదర్, శీనా

ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌కు ఘన స్వాగతం

గార్లదిన్నె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డి విజయవాడ నుంచి తొలిసారిగా బుధవారం టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదర్‌చౌదరి, రాష్ట్ర నిర్వహక కార్యదర్శి కాటప్పగారి రామలింగారెడ్డితో కలిసి జిల్లాకు వచ్చారు. విషయం తెలుసుకున్న గార్లదిన్నె, బుక్కరాయ సముంద్ర, శింగనమల మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుని, వారికి తెలుపుతు ఘన స్వాగతం పలికారు. ముంటిమడుగు కేశవరెడ్డి స్వగృహం వరకు భారీ ఎత్తు బాణసంచా పేల్చుతూ ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలో డీసీ ఛైర్మన్ చంద్రశేఖర్‌నాయుడు, గేటుక్రిష్టారెడ్డి, గుర్రం ఆదినారాయణ, అనిల్‌కుమార్‌చౌదరి, పాండు, జయరాం, గుత్తా బాలకృష్ణ, సుంకన్న, వన్నూర్, నరసింహారెడ్డి, చితంబరప్ప, రామచంద్ర, పుల్లన్న, గోరకాటి వెంకటేష్, బాబయ్య, ఎల్ఐసీ ఆదినారాయణ, గుర్రం శీనా, సుధాకర్‌రెడ్డి, దబ్బర శ్రీనాథ్‌నాయుడు, పవన్, రామాంజి, ఈశ్వర్‌రెడ్డి, ఈశ్వరయ్య, రామృష్ణ, శీనా, ముకుందాపురం నరసింహారెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, రైస్‌మిల్ వెంకట్రాముడు, తిరుపాల్, దాసరి శీనా, శేఖర్, సురేష్‌బాబు, చిరుతల గోపాల్‌రెడ్డి, మల్లికార్జున, వెంకటేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌ఓల నిరసన ర్యాలీ

అనంతపురంటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఉద్యోగభద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలనే తమ పలు డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సీహెచ్‌ఓల నిరసన జిల్లాలో కొనసాగింది. ఇప్పటికే నిరవధిక సమ్మెకొన సాగిస్తున్నారు. మూడోరోజు బుధవారం జిల్లాకేంద్రంలో జిల్లా వైద్యశాఖ కార్యాలయం నుంచి వందలాదిమంది సీహెచ్‌ఓలు ర్యాలీ నిర్వహించారు. సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్, కోర్టురోడ్డు మీదుగా తిరిగి జిల్లా వైద్యశాఖ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. అక్కడ సాయంత్రం వరకు ధర్నా చేశారు. ఏపీ ఎన్‌జీఓ నాయకులు మాధవ్, చంద్రశేఖరరెడ్డి, చంద్రమోహన్ తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ నిరసనలో సీహెచ్‌ఓల సంఘం నాయకులు అనూష, గౌరి, రాజేశ్వరి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌ఓలు

సుబ్రహ్మణ్యేశ్వరుడికి బంగారు నెమలి కంఠాభరణం



అర్చకులకు స్వామి ఆభరణాన్ని అందజేస్తున్న భక్తులు

గార్లదిన్నె, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు బంగారు నెమలి కంఠాభరణం సమర్పించారు. అనంతపురం నగరానికి చెందిన ద్వారకా చలమారెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి, ఈశ్వరమ్మ కుమారులు చంద్రమోహన్‌రెడ్డి, భారతి, శిరీష, మేఘశ్యామ్‌రెడ్డి బుధవారం కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రూ. 4. 40లక్షలు విలువ చేసే 46. 512 గ్రాముల బంగారు నెమలి కంఠాభరణాన్ని ఆలయ అర్చకులకు అందజేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆర్డీటీని రక్షించుకుందాం

● పలు సంఘాల విజ్ఞప్తి



ఫాదర్ ఫెర్రర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ అక్కులప్ప కోరారు. బుధవారం ఆర్డీటీ వ్యవస్థాపకులు డాక్టర్ విన్సెంట్ ఫెర్రర్ ఫాదర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కార్మికులు, పొదుపు సంఘాల మహిళలు, ఉద్యోగులు క్షీరాభిషేకంచేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వన్నూరుస్వామి, అన్నపూర్ణమ్మ, రత్నమ్మ, లక్ష్మికాంతమ్మ, ధనుంజయ, శ్రీనివాసులు, రవి, యల్లప్ప, అనుమంతప్ప, ముత్యాలన్న, అనిల్ కుమార్, అండ్లకూరప్ప, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం ప్రెస్‌క్లబ్: పేదల ప్రజలకు కూడు, గూడు, విద్య వైద్యం అందిస్తున్న ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని మాజీ సైనికులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఫెర్రర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న, సంఘం సభ్యులు తిమ్మారెడ్డి, మహమ్మద్ ఇర్షాద్, రాంగోపాల్, సిద్దన్న, నరసింహులు, కాజామొహిద్దీన్, పెంచలయ్య, గొల్ల ఈశ్వరయ్య రంగారెడ్డి, వీరాచారీ, హుస్సేన్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

● అనంతపురం కల్చరల్: ఆర్డీటీ సేవలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేస్తే అందుకు జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలే బాధ్యత వహించాలని ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా పేర్కొన్నారు. ఆర్డీటీ సేవల కొనసాగింపును కోరుతూ బుధవారం ఆర్డీటీ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, టిప్పు సుల్తాన్ నజీర్, గోగుల మూర్తి, సాంబ, మసూద్, నమీముల్లా, నజీర్, వన్నూర్‌బాషా, నాగేంద్ర, మల్లికార్జున, మహమ్మద్ వలి తదితరులు పాల్గొన్నారు. అలాగే సేవ్ ఆర్డీటీ, సేవ్ ఎడ్యుకేషన్ నినాదంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్, నాయకులు గిరి, భీమేష్, నగర కమిటీ నాయకులు నాగభూషణ్, సోము, విజయ్, సాయి, అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

● శింగనమల: ఆర్డీటీని కాపాడుకుందామంటూ సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి తరిమెల భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని తరిమెల ఆర్డీటీ స్కూల్ వద్ద సేవ్ ఆర్డీటీ కార్యక్రమాన్ని నిర్వహించారు

● నార్పల: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏని పునరుద్ధరించాలని కోరుతూ తహసీల్దారు, ఎంపీడీఓలకు బుధవారం దళిత సంఘాల నేతలు వినతిపత్రాలు ఆయా కార్యాలయాలలో అందజేశారు. ఏపీ ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు మీనుగ రామాంజినేయులు, నాయకులు సీమల నాగేంద్ర, రామకృష్ణ, గడ్డంనాగేపల్లి గంగయ్య, కేసపల్లి రామకృష్ణ, నార్పల ప్రసాద్, నడిమిదొడ్డి నారాయణ, పొన్నూరు తుమ్మెర లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక ఎన్నికల్లో యువత పోటీ చేయాలి'

అనంతపురం విద్య, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి యువత సిద్ధంగా ఉండాలని ఏపీ స్టూడెంట్ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అమర్ యాదవ్ పేర్కొన్నారు. ఆ సంఘం కార్యాలయంలో బుధవారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... త్వరలో జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, కౌన్సిలర్ ఎన్నికలు ఉన్నాయన్నారు. ఈ ఎన్నికల్లో యువతీ యువకలు పెద్ద ఎత్తున పోటీ చేసి, కొత్త రాజకీయాలకు తెరతీయాలన్నారు. ప్రభుత్వాలకు యువత సత్తా తెలియాలంటే...ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలని సూచించారు. జేఏసీ నాయకులు పవన్, భరత్, గోవర్ధన్, మురళి, నరేష్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పునఃప్రతిష్ఠించిన స్వామి మూలవిరాట్

పామిడి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఉదయం పూజానంతరం యంత్ర ప్రతిష్ఠ, బింబి ప్రతిష్ఠ, బొడ్డురాయి ప్రతిష్ఠ, శిఖర ధ్వజస్తంభ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలు చేపట్టారు. వేడుకలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడుయాదవ్, మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ పత్తి హిమబిందు, పీజేఆర్ సోషల్ సర్వీస్ ట్రస్టు చైర్మన్ పెరుమాళ్ల జీవానందరెడ్డి హాజరై స్వామి వారినిదర్శించుకున్నారు.

కణేకల్లు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సొల్లాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గణపతి, సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయస్వామి ఆలయంలో దేవతమూర్తుల విగ్రహ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 3 గంటల నుంచి యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠను వైభవంగా నిర్వహించారు.

పొట్టిశ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు

గుత్తి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహం ఆవరణలో ఆయన పేరుపై ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్మృతి వనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. విగ్రహ ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ గుప్తా, వెంకటేష్, మనోజ్‌కుమార్, గోపాజగదీష్, జయలక్ష్మి మొక్కలు నాటారు. మాకం శ్రీకాంత్, కిషోర్‌బాబు పాల్గొన్నారు.

ఏడీసీసీబీ చైర్మన్‌ను కలిసిన టీడీపీ నాయకులు


చైర్మన్ కేశవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పుట్లూరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా నియమితులైన ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశ్‌లను టీడీపీ మండల నాయకులు బుధవారం వేర్వేరుగా కలిశారు. వారికి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ పార్టీలో పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఇవ్వడం సంతోషదగ్గ విషయమన్నారు. మండల కన్వీనర్ బాలరంగయ్య,సుదర్శన్‌నాయుడు, శ్రీనివాసులనాయుడు, పుట్లూరు పుల్లారెడ్డి, దస్తగిరి, రామాంజనేయులు, తేజారెడ్డి పాల్గొన్నారు.

హజ్ కమిటీ డైరెక్టర్ ప్రమాణస్వీకారం


చైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఏపీ హజ్‌కమిటీ డైరెక్టర్‌గా మున్సిపల్ కౌన్సిలర్ రేష్మాపర్వీన్ బుధవారం విజయవాడలో ప్రమాణస్వీకారం చేశారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వివిధప్రాంతాల నుంచి 13మంది డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం 13మంది డైరెక్టర్లు కలిసి హజ్‌కమిటీ చైర్మన్‌ను హసిన్‌బాషాను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, పవన్‌కల్యాన్‌కు, లోకేశ్, ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి, జేసీ పవన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పశువుల దాహం తీర్చేందుకు నీటి తొట్టెలు

కూడేరు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వేసవిలో పశువులతోపాటు మూగజీవాలు దాహం తీర్చేందుకు నీటి తొట్టెలు ఎంతో ఉపయోగకరమని డీడబ్ల్యూఎంఏ పీడీ సలీమ్‌బాషా అన్నారు. బుధవారం కూడేరు సమీపంలోని సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద, కల్లగళ్ల రోడ్డు వద్ద బాట వెంకటేష్ తోట వద్ద పశువుల దాహం తీర్చేందుకు నీటి తొట్టెలు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలు మండిపోతుండటంతో మూగ జీవాలు దాహంతో అల్లాడిపోతున్నాయని, ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం నీటి తొట్టెలు నిర్మాణం చేపడుతుందన్నారు. సర్పంచు లలితమ్మ, ఏపీడీ విజయ్‌కుమార్, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏపీఓ పోలేరయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

దుకాణాలపై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ దాడులు

తాడిపత్రి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు దుకాణాలను, హోటళ్లను బుధవారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రమూర్తి దాడులు చేశారు. సరుకులతోపాటు ఆహారపదార్థాలను పరిశీలించి పలువురు దుకాణాల యజమానులను హెచ్చరించారు. ప్రతి ఒక్క దుకాణ యజమాని ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్‌ను కలిగి ఉండాలన్నారు. లైసెన్సులు లేని పలువురిపై కేసులు నమోదుచేశామని తెలిపారు.

గొయ్యిలో ఇరుక్కున్న ఆటో


ఇరుక్కున్న ఆటోను బయటకు తీస్తున్న దృశ్యం

గుత్తి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోటకు వెళ్లే రహదారిలో ఓ డ్రైనేజీకి సంబంధించి మ్యాన్‌హోల్‌కు మూతలేకపోవడంతో ఆటో చక్రం ఇరుక్కుపోయింది. కటిక మార్కెట్‌కు వెళ్లే దారిలో ఓ డ్రైనేజీకి సంబంధించి మ్యాన్‌హోల్‌కు మూతలేకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ద్విచక్రవాహనాదారులు, పాదచారులు గొయ్యిలో పడి గాయపడ్డారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ప్రమాదవశాత్తు ఆటో చక్రం గోతిలో ఇరుక్కుంది. అదృష్టవశాత్తు ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. వెంటనే స్థానికులు గమనించి ఆటో కిందపడకుండా ఆటోను పక్కనపెట్టారు. మున్సిపల్ అధికారులకు చర్యలు తీసుకోవాలని మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని కౌన్సిలర్ నజీర్ ఆవేదన వ్యక్త పరిచారు.

రోడ్డు కొలతల్లో కుదరని పొంతన

- తలలు పట్టుకున్న అధికారులు
- విచారణ వాయిదా


గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

విడపనకల్లు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): డొనేకల్లు-ఆర్ కొట్టాల రోడ్డు కొలతల్లో పొంతన లేకపోవడంతో అక్కడికి వచ్చిన జిల్లా అధికారులు తలలు పట్టుకున్నారు. దీంతో చేసేది లేక వచ్చిన అధికారులు విచారణ వాయిదా వేసి వెనుతిరాగారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. డొనేకల్లు-ఆర్ కొట్టాల రోడ్డును పరిశీలించేందుకు ఎస్‌ఈ మహమ్మద్ జహీర్ అస్లామ్, ఈఈ ప్రభాకర్ రెడ్డి, డీఈ మహమ్మద్‌రసూల్ బుధవారం డొనేకల్లు గ్రామానికి వచ్చారు. అధికారులు గ్రామస్థులు అందరూ కలిసి రోడ్డు పనులు పరిశీలించారు. రోడ్డు వేయకుండానే వేసినట్లు బిల్లులు ఎలా డ్రా చేశారని అధికారులను గ్రామస్థులు నిలదీశారు. కాంట్రాక్టర్ కలుగజేసుకుని రోడ్డు పనులు చేశానని, బిల్లులు ఆలస్యంగా ఇవ్వటంతో మిగిలిన పనులు నిలిపి వేశానన్నారు. కేవలం రోడ్డుకు 6ఎంఎం కంకర వేసి వదిలేయటంతో రైతులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు అన్నారు. కంకరను రోడ్డుపై లేకుండా రైతులే పక్కకు నెట్టించారన్నారు. ఎటువంటి రోడ్డు వేయకుండా మూడు విడతల్లో రూ.26 లక్షలు డ్రా చేసినట్లు ఎం బుక్‌లో రికార్డు చేశారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంబక్‌లో ఉన్న కొలతలకు రోడ్డుపై ఉన్న కొలతలకు తేడా ఉండటంతో జిల్లా అధికారులే తలలు పట్టుకున్నారు. అక్కడ బీటీ రోడ్డు లేక పోవటం కంకర మాత్రమే ఉండటంతో అధికారులతో గ్రామస్థులు వాగ్వాదానికి దిగారు. విచారణ మొత్తం పక్కదారి పట్టించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఏమీ తేల్చలేక మరోసారి విచారణకు వస్తామని అధికారులు వెళ్లిపోయారు. విలేకర్లు ఎస్‌ఈని వివరణ కోరగా విచారణ ఇంకా పూర్తి కాలేదని మరోసారి వచ్చి పూర్తిస్థాయిలో విచారించి జిల్లా అధికారులకు నివేదికలు ఇస్తామన్నామన్నారు. మండల ఏఈ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న పార్కు పరిశీలన


క్రికెట్ వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండురోజులక్రితం వీచిన గాలి బీభత్సానికి దెబ్బతిన్న ప్రాంతాలను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి బుధవారం పర్యటించారు. వాటితోపాటు జేసీ పార్కు వద్ద ఉన్న క్రికెట్ బాక్స్ వేదిక కుప్పకూలింది. ఆయన మాట్లాడుతూ గాలిబీభత్సానికి భారీగా చెట్లు కూలడం, పంట నష్టం జరిగిందన్నారు. ఇప్పటికే ఉన్నతాధికారులకు పంటనష్టంపై సర్వేచేసి నివేదిక ఇవ్వాలని ఆయాశాఖల అధికారులకు తెలపడం జరిగిందన్నారు. మామిడి, అరటి, బొప్పాయి, చీనీపంటల రైతులు భారీగా నష్టపోయారన్నారు. ఈ మధ్యకాలంలో గాలిబీభత్సానికి రైతుల్లో నిరాశే ఎదురవుతుందన్నారు. ఇప్పటికే అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఆయన వెంట ఎస్వీ రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, విజ్జి, సుధీర్‌రెడ్డి, అమాన్ ఉన్నారు.

భక్తుడిపై కాంట్రాక్టరు అనుచిత ప్రవర్తన

గుంతకల్లు, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): కసాపురం దేవస్థానానికి వచ్చిన ఓ భక్తుడిపై సెల్‌ఫోన్ డిపాజిట్ చేసుకునే కాంట్రాక్టరు అనుచితంగా ప్రవర్తించి, దుర్భాషలాడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. తాడిపత్రికి చెందిన ఆంజనేయులు అనే భక్తుడు నెట్టికంటి దర్శనం కోసం కసాపురం దేవస్థానానికి వచ్చారు. టెంకాయలు కొన్నచోటనే సెల్‌ఫోన్‌ను ఉంచి ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. దేవస్థానంలోకి సెల్‌ఫోన్ అనుమతి లేదని, ఫోనును కౌంటర్‌లో ఇచ్చి టోకెన్ తీసుకోవాలంటూ బాల అనే వ్యక్తి ఆంజనేయులుకు తెలిపాడు. ఫోన్ తన వద్ద లేదని, బయటనే పెట్టి వచ్చానని తెలుపగా, లేదు నీవద్ద ఫోన్ ఉందంటూ బాల గద్దించాడని, మాటామాటా పెరిగి తనను దుర్భాషలాడాడని భక్తుడు ఆంజనేయులు వాపోయాడు. దీనిపై ఆలయ అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోలేదని ఆరోపించాడు.

మట్కా బీటర్ అరెస్ట్

రాయదుర్గం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జుంజురంపల్లి గ్రామానికి చెందిన భీమప్ప అనే మట్కా బీటర్‌ను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు. మట్కా రాస్తున్నాడని సమాచారాన్ని సేకరించి 74 ఉడేగోళం గ్రామంలో బస్టాండ్ వద్ద మట్కా రాస్తున్న అతనిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. భీమప్పను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ. 9వేలు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చెత్త తరలింపు ట్రాక్టర్‌కు డీజిల్ లేదట..!

- యాడికి గ్రామ పంచాయతీలో చోద్యం


చెత్తతో నిండిన ట్రాక్టర్‌ను నివాస గృహాల మధ్య వదిలివేసిన దృశ్యం

యాడికి, ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): చెత్తతరలింపు ట్రాక్టర్‌కు డీజిల్ కొరత పేరుతో ఊరంతా సేకరించిన చెత్తట్రాక్టర్‌ను నివాస గృహాల మధ్యనే వదిలివేయడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఘటన యాడికిలో చోటుచేసుకుంది. మూడు రోజులక్రితం యాడికిలోని హాస్పిటల్ కాలనీలో చెత్తను ట్రాక్టర్ ద్వారా సేకరించారు. దానిని డంపింగ్‌యార్డుకు తరలించాల్సి ఉంది. అయితే నివాస గృహాల మధ్యనే ట్రాక్టర్‌లో డీజిల్ అయిపోవడంతో అక్కడే నిలిపివేశారు. ఈ విషయాన్ని సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఎవరూ స్పందించకపోవడంతో చెత్తతో నిండిన ట్రాక్టర్‌ను మూడురోజులుగా అక్కడే వదిలివేశారు. చెత్తనుంచి వచ్చే దుర్గంధాన్ని భరించలేక ఇదేమి చెత్త పంచాయతీనో అంటూ చర్చించుకోవడం కనిపించింది. దీనిపై గ్రామ పంచాయతీ కార్యదర్శి అశ్వత్థమనాయుడును వివరణ కోరగా తక్షణమే చెత్తతరలింపు ట్రాక్టర్‌ను అక్కడి నుంచి తరలిస్తామని తెలిపారు.

బీరు బాటిళ్లతో ఇంటిపై దాడి

యాడికి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాయలచెరువులోని ఓ విలేకరి ఇంటిపై ఖాళీ బీరు సీసాలతో దాడి సంఘటనపై బుధవారం కేసు నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 21న రాత్రి రాయలచెరువులో నివాసం ఉంటున్న విలేకరి రామకృష్ణ ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు ఖాళీ బీరు సీసాలతో దాడిచేశారు. ఈ ఘటనపై రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని హడగలి గ్రామంలో బుధవారం సాయంకాలం పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. హడగలి చెందిన నాగేంద్రప్ప వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎద్దులతో పొలం పనులు అనంతరం గ్రామ సమీపంలో ఎద్దుల దొడ్డి వద్ద వాటిని కట్టి ఉంచాడు. బుధవారం సాయంకాలం ఈదురు గాలులతో వర్షం మొదలైంది. ఉరుములు మెరుపులు మొదలయ్యాయి. ఒక్కసారిగా పిడుగుపడింది. ఈ ఘటనలో ఎద్దు మృతి చెందింది.

నాటుసారా స్థావరాలపై దాడులు

ఉరవకొండ,ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి పెద్దతండా, చిన్నతండాలో నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. డీపీఈవో రామ్మోహన్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ శివకుమార్, ఎస్ఐ నాగస్వామి దాడులు చేశారు. 300లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 20లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వెంకటేశం, సుశీలమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గుత్తిరూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురం గ్రామాశివారు 44వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. యాడికి మండలం పిన్నేపల్లి గ్రామానికి చెందిన రామ్మోహన్‌రెడ్డి గుంతకల్లు మండలం అమీన్‌పల్లికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా శ్రీపురం గ్రామాశివారులో వెనుక నుంచి కారు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రయాణికులకు స్వల్పగాయాలు

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి గ్రామ సమీపంలో ఉన్న టోల్ ప్లాజా వద్ద తెల్లవారుజామున ఆర్టీసీ బస్సు లారీని ఢీకొన్న ఘటనలో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు ఏపీఎస్ఆర్టీసీ బస్సు బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్లే క్రమంలో టోల్‌ప్లాజా వద్ద ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండడంతో లారీ ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

చట్టాలకు అనుగుణంగా వ్యాపారాలు చేయాలి

గుత్తి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): విత్తన విక్రయదారులు నూతన వ్యవసాయ చట్టాలకు అనుగుణంగా వ్యాపారాలు చేయాలని ఏడీఏ వెంకటరాముడు సూచించారు. స్థానిక మార్కెట్ యార్డులో అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌లో విత్తన కొనుగోలు, అమ్మకాలు,ఎరువులు, వ్యవసాయ చట్టాలపై ఫర్టిలైజర్స్ డీలర్లు, వ్యవసాయ అధికారులకు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ విత్తన విక్రయదారులు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలన్నారు. ముస్తాక్‌అహ్మద్, మల్లేశ్వరి, మహబూబ్ బాషా, అన్వేష్‌కుమార్, టెక్నికల్ ఏఓ మెహరున్నీసా బేగం పాల్గొన్నారు.

నాన్‌టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ఉరవకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో నాన్‌టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఒక ప్రకటనలో తెలిపారు. టైప్-4 కింద హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్, చౌకీదారు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 3వ తేదీలోపు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారాలు ఎంఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం


పోస్టర్లను విడుదల చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సమష్టి కృషితో బాల్యవివాహాలను అరికడదామని జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వరి అన్నారు. కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం జిల్లా బాలల పరిరక్షణ సమితి, ఆలయ ఈఓ వాణి ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, బాలలపై లైంగికదాడుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, మహిళా పోలీస్ అనూష, ఆలయ ప్రధాన అర్చకుడు గరుడాచారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, ఆదిలక్ష్మి, ఎస్తేరమ్మ, పాల్గొన్నారు.

కూడేరు: బాలికల భవిష్యత్తుకు కిశోరీ వికాసం అవసరమని, సీడీపీఓ శ్రీదేవి, ఏసీడీపీఓ యల్లమ్మ అన్నారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోరీ వికాసం, బాలికల భవిష్యత్తు తదితర అంశాలపై అంగన్‌వాడీ, ఆశాలతో సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్లు రాజేశ్వరీ, అరుణ పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలకేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సమ్మర్ క్యాంపులో భాగంగా శుక్ర, శనివారాల్లో కిశోర బాలికలకు బాల్యవివాహాలు జరగడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు.

తాడిపత్రి: బాల్యవివాహాలను అరికడదామని డీసీపీయూ యూనిట్ సిబ్బంది రమాదేవి పిలుపునిచ్చారు. స్థానిక బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో బుధవారం బాల్యవివాహాల నిషేధం, నిర్మూలన పోస్టర్లను ఆవిష్కరించారు.

పుట్లూరు: మండలంలో 2 నుంచి జూన్ 10వరకు కిశోరబాలికలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. 11నుంచి 18ఏళ్ల లోపు బాలికలకు గ్రామస్థాయిలో అవగాహన కల్పిస్తామని తెలిపారు.

ఆర్డీటీని కాపాడుకుందాం


ఉరవకొండలో ర్యాలీ చేస్తున్న బంజారా సంఘం నాయకులు

ఉరవకొండ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బంజారా సంఘం నాయకుడు కేశవ నాయక్ అన్నారు. వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి పెద్ద తండాలో బుధవారం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని కోరుతూ బంజారా నాయకులు ఫెర్రర్ చిత్రపటంతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. నాయకులు దాసునాయక్, తులసీదాస్ నాయక్, ఎర్రిస్వామి నాయక్ పాల్గొన్నారు.

పామిడి: నిరుపేదలకు విద్య, వైద్యంతో పాటు పలు సంక్షేమ పథకాల్లో చేదోడు వాదోడుగా ఉన్న ఆర్డీటీకి ఎఫ్ఆర్‌సీఏ పునరుద్ధరించాలని విశాల ఫెర్రర్ వికలాంగుల మండల సమాఖ్య డిమాండ్ చేసింది. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద సేవ్ ఆర్డీటీ పోస్టర్లతో దివ్యాంగులు నిరసన తెలిపారు. సమాఖ్య అధ్యక్షులు కేశవాచారి, కార్యదర్శి సర్వేష్, సహాయ కార్యదర్శి నాగభూషణం, శివన్న, నరసింహులు, కేశవ, రహంతుల్లా, మల్లికార్జున, ఓబుళపతి, లక్ష్మయ్య, సునీల్, రాజేష్, ఫారీ, సుధాకర్, తిరుపాల్‌రెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

తాడిపత్రి: ఆర్డీటీ సంస్థ పునరుద్ధరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ కార్యదర్శి చిరంజీవి నిరసన తెలిపి తహసీల్దార్ రజాక్‌వలికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ అనంతపురం జిల్లాకు ఉన్నత సేవలను అందిస్తోందన్నారు. ఎఫ్‌సీఆర్ఏ కింద వచ్చే ఫారిన్ నిధులను కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమన్నారు. విద్య, వైద్యం, గృహనిర్మాణ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పేదల అభ్యున్నతికి తీవ్రంగా కృషి చేసిందన్నారు.


అశేష భక్తుల నడుమ కదులుతున్న రథం

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం అశేష జనవాహిని మధ్య వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఉదయం స్వామివారికి ప్రత్యేకపూజలను నిర్వహించారు. వైశాఖ శుద్ధ తదియ (అక్షయ తృతీయ) సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీవారికి పంచామృతాభిషేకం, దీక్షాహోమం, బలిహరణ, ఉదయం 10 గంటలకు రథాంగహోమం, బలి, పూర్వ వీధుల మడుగుతేరు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక పూజలను చేశారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారిని పల్లకిలో ఆలయం చుట్టూ ఊరేగింపు నిర్వహించి స్వామివారి రథోత్సవంపై ఉత్సవ విగ్రహాలను ఉంచి రథోత్సవమును ఆలయ కమిటీ సభ్యులు, యువకులు లాగారు. ఆలయ ప్రాంగణం నుంచి ప్రధాన రహదారిపై స్వామివారి రథాన్ని ఊరేగించారు.

లక్ష్మీనారాయణస్వామి రథోత్సవం

రాయదుర్గం,: పట్టణంలోని లక్ష్మీబజార్‌లో వెలసిన లక్ష్మీనారాయణస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. బుధవారం రాత్రి జరిగిన ఉత్సవాల్లో వాల్మీకి సంక్షేమ సేవాసమితి అధ్యక్షులు స్వామివారి ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు నాయకుల బండి క్రిష్టప్ప పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. కమిటీ అధ్యక్షులు గెల్లి రామరాజు, ఇతర కమిటీ సభ్యులు గెల్లి వాసు, రాజశేఖర్‌రెడ్డి, మధు ఇతర ఆలయ కమిటీ సభ్యులకు, ఉత్సవాలకు 10,100 తన వంతుగా అందజేశారు.

ఘనంగా బసవ జయంతి


కళ్యాణదుర్గంలో బసవ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విశ్వగురు బసవ జయంతిని పట్టణంలోని ప్రజావేదికలో బుధవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బసవేశ్వర స్వాముల 892వ జయంతిని నిర్వహించారు. స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ గోళ్ల లక్ష్మీదేవి, మాజీ చైర్మన్ చౌళం మల్లికార్జున, ఆర్‌జీ శివశంకర్, గోళ్ల రమేష్, అమరా రామమోహన్, మురళి, మాజీ జడ్పీటీసీ కొల్లాపురప్ప, మల్లిపల్లి నారాయణ, నాగన్న పాల్గొన్నారు.

కణేకల్లు: బసవ జయంతి వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక వేంకటేశ్వరస్వామి గుడి వద్ద ఉన్న బసవణ్ణ ఆలయంలో వీరశైవ లింగాయతులు, జంగమ కులస్థులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో బుధవారం బసవ జయంతిని వైభవంగా నిర్వహించారు. బసవేశ్వరకు విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గంగాజలం తెచ్చి స్వామివారిని అభిషేకించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాయదుర్గం: పట్టణంలో బుధవారం బసవజయంతిని ఘనంగా నిర్వహించారు. కోట ప్రాంతంలో వీరభద్రస్వామి ఆలయంలో ఉదయాన్నే అభిషేకాలు ప్రత్యేకపూజలు నిర్వహించారు. సాయంత్రం బసవేశ్వరుడి చిత్రపటం ఊరేగించారు.

ఏఓపై బదిలీ వేటు

గుంతకల్లు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): స్థానిక రాయ్ సాహెబ్ మిడతల హంపయ్య ఏరియా ఆసుపత్రిలో ఏఓగా విధులు నిర్వర్తించిన రాంప్రసాద్‌పై బదిలీ వేటు పడింది. రాంప్రసాద్ ఆసుపత్రిలోని వైద్యులు, పారిశుద్య మహిళా సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నాడంటూ అనంతపురం డీసీహెచ్ఎస్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై ఓ విచారణ బృందం ఇక్కడకు వచ్చి ఫిర్యాదులపై విచారణజరిపింది. కానీ ఏఓపై చర్యలు తీసుకోకపోవడంతో రాంప్రసాద్ రాజకీయ పలుకుబడితో తనపై శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా మేనేజ్ చేశాడని ఆరోపిస్తూ సీపీఐ ఎంఎల్ పార్టీ డివిజనల్ కార్యదర్శి బీ సురేశ్ తాడేపల్లిలోని వైద్యవిధాన పరిషత్ కమిషనరు కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఏఓపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుచేశారు. ఆ ఫిర్యాదు మేరకు రెండోసారి విచారణ జరిగింది. ఆరోపణలు నిజమని తేలడంతో ఏఓను పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు బదిలీ చేస్తూ సెకెండరీ హెల్త్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ జయవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. దీనిపై సురేశ్ మాట్లాడుతూ ఏఓ రాంప్రసాద్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా కేవలం బదిలీతో సరిపెట్టారని, రాజకీయ ఒత్తిళ్లతోనే చర్యలు తీసుకోలేదన్నారు.

ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

పామిడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో ఆర్ఎంపీ డాక్టర్లు చెలగాటం చేయవద్దని ఎద్దులపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ హెచ్చరించారు. మండలంలోని ఎద్దులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆర్ఎంపీ డాక్టర్లతో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్సా కేంద్రానికి వచ్చే ప్రతి పేషెంట్ వివరాలు రికార్డులో పొందుపరచాలన్నారు.

ప్రమాద బీమా మంజూరు

బెళుగుప్ప, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కలపల్లికి చెందిన అరుణకు టీడీపీ సభ్యత్వ ప్రమాద బీమా రూ.5 లక్షలు మంజూరైనట్లు బుధవా రం ఆ పార్టీ నాయకులు ప్రతాప్ రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, తిమ్మప్ప తెలిపారు. ఈమె పొలంలో పప్పుశనగ కట్టి నూర్పిడి యంత్రంలో వేస్తుండగా మిషన్‌లోకి పడి ఫిబ్రవరి 4వ తేదీ మృతి చెందారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉషారాణి

పామిడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పామిడి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉషారాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత తహసీల్దార్ శ్రీధరమూర్తి 10వ తేదీ వరకు సెలవు పెట్టడంతో పెద్దవడుగూరు తహసీల్దార్ ఉషారాణికి బాధ్యతలు అప్పగించారు